

ఆంధ్రజ్యోతి ABN

నేడు, రేపు ముగ్గుల పోటీలు

జంగారెడ్డిగూడెం టౌన్, జనవరి 5 : సంక్రాంతి పండుగలను పురస్కరించుకుని ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లా నారీమణుల కోసం ఎప్పటిలాగే రెండు రోజులపాటు జరిగే ముత్యాల ముగ్గుల పోటీలకు వేదికలు సిద్ధమయ్యాయి. 'ఆంధ్రజ్యోతి - ఏబీఎన్ నిర్వహిస్తున్న కెనరా బ్యాంక్ ముత్యాల ముగ్గుల పోటీలు.. పవర్డ్ బై ఎయిమ్స్ విద్యాసంస్థలు, బెంగళూరు.. రియల్ పార్టనర్ స్వర్గసీమ సుకేతన' సారథ్యంలో సెయింట్ జాన్స్ ఎడ్యుకేషనల్ అండ్ డెవలప్‌మెంట్ సొసైటీ జనరల్ సెక్రటరీ బొమ్మాజి అనిల్ సౌజన్యంతో శనివారం ఉదయం తొమ్మిది గంటలకు జంగారెడ్డిగూడెం త్రివేణి ప్రసాద్ కళాశాల మైదానంలో పోటీలు ప్రారంభం కానున్నాయి. అనురాధ కన్‌స్ట్రక్షన్ చైర్మన్ రెడ్డి అప్పల నాయుడు, చింతమనేని చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ చింతమనేని ప్రభాకర్ సౌజన్యంతో ఏలూరు అశోక్‌నగర్‌లోని కేపీడీటీ హైస్కూల్ గ్రౌండ్‌లో ఆదివారం ఉదయం తొమ్మిది గంటలకు పోటీలు జరుగుతాయి. న్యాయ నిర్ణేతలు విజేతలను ఎంపిక చేసి మొదటి బహుమతి రూ.6 వేలు, రెండో బహుమతి రూ.4 వేలు, మూడో బహుమతి రూ.3 వేలు చొప్పున నగదుతోపాటు కన్సొలేషన్ బహుమతులు అందజేస్తారు.

పోలీసుల దాష్టీకం



మహిళలను ఈడ్చుకెళ్తున్న పోలీసులు

వంగాయిగూడెం వెహికల్ డిపో వద్ద ఉద్రిక్తత

- ప్రైవేటు వ్యక్తులను అడ్డుకున్న మునిసిపల్ కార్మికులు
- రంగంలోకి దిగిన పోలీసులు
- మహిళలను సైతం ఈడ్చుకుంటూ స్టేషన్‌కు తరలింపు
- నేడు నగరపాలక సంస్థ కార్యాలయం ముట్టడి

ఏలూరు టూ టౌన్, జనవరి 5 : శాంతియుతంగా సమ్మె చేస్తున్న మునిసిపల్ కార్మికులపై పోలీసులు విరుచుకుపడ్డారు. మహిళలను సైతం పెడరెక్కలు విరిచి రోడ్లపై ఈడ్చుకుంటూ పోలీసువ్యాన్‌లో పడేసి స్టేషన్‌కు తరలించారు. వంగాయిగూడెం వెహికల్ డిపో వద్ద మునిసిపల్ కార్మికులు పదకొండు రోజులుగా చేస్తున్న సమ్మెను చేస్తున్నారు. శుక్రవారం మునిసిపల్ అధికారులు ప్రైవేటు వ్యక్తులను తీసుకొచ్చి ప్రైవేటు వాహనాలు, క్లాప్ ఆటోలను బయటకు తీసుకెళ్తుండగా కార్మికులు అడ్డుకున్నారు. మా సమస్యలు తీర్చకుండా ప్రైవేటు వ్యక్తులతో పనులు చేయిస్తే ఊరుకోమని మహిళా కార్మికులంతా వాహనాలకు అడ్డుగా నిలిచారు. దీంతో పురుష కానిస్టేబుళ్లు మహిళలను రోడ్డుపై ఈడ్చుకుంటూ పోలీస్ వ్యాన్ ఎక్కించి వన్‌టౌన్ స్టేషన్‌కు తరలించారు. మిగిలిన కార్మికులంతా స్టేషన్‌ను ముట్టడించడంతో సాయంత్రం వారిని వదిలేశారు. మునిసిపల్ వర్కర్స్ యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి జాన్‌బాబు, నగర అధ్యక్షుడు కృష్ణారావు మాట్లాడుతూ అరెస్టులు చేయడం ద్వారా ఉద్యమం ఆపలేరన్నారు. అక్రమ అరెస్టులు మాని జగన్ ఇచ్చిన హామీలు నెరవేర్చాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వ విధానం మారకపోతే ఎన్నికల్లో తమ తడాఖా చూపిస్తామని హెచ్చరించారు. మున్సిపల్ కమిషనర్ దౌర్జన్యంగా, బెదిరింపులతో, అక్రమ అరెస్టులు చేయించడాన్ని నిరసిస్తూ శనివారం నగరపాలక సంస్థ కార్యాలయాన్ని ముట్టడిస్తామని యూనియన్ నాయకుడు సోమయ్య తెలిపారు. ఆటో డ్రైవర్ల యూనియన్ ప్రధాన కార్యదర్శి జె.గోపి, తదితరులు పాల్గొన్నారు.



ట్రాక్టర్లను అడ్డుకుంటున్న మహిళా కార్మికులు

సడలని అంగన్‌వాడీల పోరు



ఏలూరులో నిరసన తెలుపుతున్న అంగన్‌వాడీలు

ఏలూరు రూరల్, జనవరి 5: తమ సమస్యల పరిష్కారం కోరుతూ జిల్లా వ్యాప్తంగా అంగన్‌వాడీలు చేపట్టిన నిరవధిక సమ్మె శుక్రవారం నాటికి 25వ రోజుకు చేరుకుంది. ఏలూరులోని కలెక్టర్ కార్యాలయం వద్ద పెద్ద సంఖ్యలో హాజరైన అంగన్‌వాడీలు ప్రభుత్వం వెంటనే స్పందించాలని, డిమాండ్లు పరిష్కరించాలని, కనీసవేతనం అమలు చేయాలని, సీఎం జగన్ ఎన్నికల ముందు ఇచ్చిన వాగ్దానాలు నెరవేర్చాలని 25 సంఖ్య ఆకారంలో కూర్చొని నినదించారు. సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి డి.ఎన్.వి.డి ప్రసాద్ మాట్లాడుతూ 5వ తేదీలోపు విధుల్లో చేరకుంటే తొలగిస్తామని బెదిరింపు ప్రకటనలు మాని సమస్యల పరిష్కారంపై దృష్టిపెట్టాలన్నారు. ఏపీ అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ జిల్లా గౌరవాధ్యక్షులు కె.విజయలక్ష్మి, పి.హైమావతి, తదితరులు పాల్గొన్నారు. కాగా అంగన్‌వాడీ సమ్మెలో భాగంగా శనివారం నుంచి 24 గంటల రిలే నిరాహార దీక్షలు నిర్వహించనున్నట్టు ఏపీ అంగన్‌వాడీ వర్కర్స్ హెల్పర్స్ యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి పి.భారతి ఓ ప్రకటనలో తెలిపారు.

కట్‌కట!



నూజివీడు ట్రిపుల్ ఐటీ వ్యూ

రెండు రోజులుగా నూజివీడు ట్రిపుల్ ఐటీలో నిలిచిన విద్యుత్ సరఫరా

- పూర్తిస్థాయిలో పనిచేయని జనరేటర్లు
- సెల్‌ఫోన్ వెలుగుల్లో విద్యార్థుల చదువులు

నూజివీడు టౌన్, జనవరి 5 : నూజివీడు ట్రిపుల్ ఐటీలో గత రెండు రోజుల నుంచి విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. నూజివీడు పట్టణ పరిధిలో ట్రిపుల్ ఐటీ క్యాంపస్‌కు విద్యుత్ సరఫరా చేసేందుకు ప్రత్యేకంగా సబ్‌స్టేషన్‌ను ఏర్పాటు చేశారు. దీంతోపాటు సోలార్ విద్యుత్ ప్లాంట్ అందుబాటులో ఉంది. సబ్‌స్టేషన్ నుంచి ట్రిపుల్ ఐటీకి విద్యుత్ సరఫరా అందించే క్రమంలో ఏర్పాటు చేసిన ఇంటర్నల్ ట్రాన్స్‌ఫార్మర్‌లో సాంకేతిక సమస్యలు తలెత్తడంతో గురువారం ఉదయం నుంచి క్యాంపస్ మొత్తానికి విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. విద్యార్థులు రాత్రి పూట సెల్‌ఫోన్ వెలుగుల మధ్య గడపాల్సిన పరిస్థితి ఎదురైంది. ఆర్జీయూకేటీ పరిధిలోని నూజివీడు ట్రిపుల్ ఐటీ క్యాంపస్‌లో ఆరు వేల మంది విద్యార్థులు రెసిడెన్షియల్ విద్యా విధానంలో విద్యనభ్యసిస్తున్నారు. వీరికి అదనంగా శ్రీకాకుళం ట్రిపుల్ ఐటీకి చెందిన మరో 2 వేల మంది నూజివీడు ట్రిపుల్ ఐటీ క్యాంపస్‌లోనే వసతి పొందుతున్నారు. వీరికి అదనంగా మరో 1500 మంది సిబ్బంది వివిధ హోదాల్లో పనిచేస్తుండగా, రెండురోజులుగా విద్యుత్ సరఫరా నిలిచిపోవడంతో వీరందరూ తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. అయితే తాగునీటి సరఫరా, నీటి సరఫరా మోటార్లు, మెస్ తదితర విభాగాలకు జనరేటర్ల ద్వారా విద్యుత్ సరఫరా చేస్తున్నారు.

రెండు రోజులుగా సమస్య ఎక్కడో గుర్తించలేదు..

ట్రాన్స్‌ఫార్మర్‌లో లోపం కారణంగా ట్రిపుల్ ఐటీకి విద్యుత్ సరఫరా నిలిచిపోగా రెండు రోజులు గడిచినా అసలు సమస్య ఎక్కడ ఉత్పన్నమైందో గుర్తించడంలో అధికారులు విఫలమయ్యారు. మరోవైపు లక్షలాది రూపాయల వ్యయంతో ఏర్పాటు చేసిన జనరేటర్లు సైతం నిర్వహణ లోపంతో పూర్తిస్థాయిలో పనిచేయడం లేదని ఫలితంగా విద్యుత్ సరఫరా నిలిచిన సమయంలో సమస్యను అధిగమించడానికి అవకాశం లేకుండా పోయిందనే ఆరోపణలు వినిపిస్తున్నాయి.

సెమిస్టర్ పరీక్షలను అధిగమించేది ఎలా..?

పరీక్షల నిర్వహణ సమయంలో రెండు రోజులు విద్యుత్ సరఫరా నిలిచిపోవడంతో విద్యార్థులు తీవ్ర ఆందోళనకు గురవుతున్నారు. గత నెల 27 నుంచి ఈ నెల 10వ తేదీ వరకు క్యాంపస్‌లో ఇంటిగ్రేటెడ్ పీయూసీ, ఇంజినీరింగ్ విద్యార్థులకు సెమిస్టర్ పరీక్షలు జరుగుతున్నాయి. ఈ నేపథ్యంలో గురువారం నుంచి విద్యుత్ సరఫరా నిలిచిపోవడంతో విద్యార్థులు పరీక్షలకు ఎలా ప్రిపరేషన్ అవ్వాలో తెలియక ఆందోళనకు గురవుతున్నారు. పరీక్షల నిర్వహణకు సంబంధించి ఉదయం పూట ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా యాజమాన్యం ముందస్తు చర్యలు తీసుకున్నా విద్యార్థులు పరీక్షలకు సిద్ధమవ్వడానికి (ప్రిపరేషన్) కోసం కావాల్సిన సదుపాయాల కల్పనకు విద్యుత్ సరఫరా మూలం అవ్వడంతో విద్యార్థులు ఆందోళన చెందుతున్నారు. విద్యుత్ సరఫరా నిలిచిపోయిన విషయమై నూజివీడు ట్రిపుల్ ఐటీ క్యాంపస్ ఏవో ప్రదీప్‌ను వివరణ కోరగా నూజివీడు ట్రిపుల్ ఐటీలో అండర్ కేబుల్ విధానంలో విద్యుత్ సరఫరా జరుగుతోందని, లోపం ఎక్కడ తలెత్తిందో తెలుసుకుని అధిగమించేందుకు చర్యలు చేపట్టామన్నారు.

బియ్యం ధరలు భగ్గు

- వ్యాపారుల సిండికేట్
- 26 కిలోల ప్యాకెట్ రూ.1500 పైనే
- సన్న రకంపైనే జిల్లాలో మోజు
- కొని తినాలంటేనే జంకుతున్న జనం



బియ్యం ధరలు భగ్గుమంటున్నాయి. వ్యాపారులు సిండికేట్‌గా అమాంతం పెంచేస్తున్నారు. జిల్లావాసుల్లో ఎక్కువ మంది సన్న రకాలనే కొనుగోలు చేస్తుంటారు. మార్కెట్‌లో వాటికి డిమాండ్ ఎక్కువగా ఉంటోంది. పప్పులు, కూరగాయ ధరలతోపాటు బియ్యం ధరలు ఆకాశాన్ని తాకడంతో సామాన్య, మధ్య తరగతి జనం బెంబేలెత్తుతున్నారు.

ఏలూరు రూరల్/ముదినేపల్లి రూరల్, జనవరి 5 : తూర్పు గోదావరి, కృష్ణా, గుంటూరు జిల్లాల నుంచి ఉమ్మడి పశ్చిమకు సన్న రకాలు దిగుమతి అవుతున్నాయి. ప్రధానంగా సోనా మసూరి వంటి రకాలను జిల్లాలో ఎక్కువగా వినియోగిస్తుంటారు. జిల్లాలో సాగయ్యే రకాలపై పెద్దగా ఆసక్తి చూపరు. కేవలం రేషన్ పంపిణీకి మాత్రమే జిల్లాలో ఉత్పత్తి అయ్యే బియ్యం ఉపయోగపడుతున్నాయి. మళ్లీ అవి మార్కెట్‌కు తరలిపోతున్నాయి. ఏడాదిన్నర క్రితం వరకు రిటైల్ మార్కెట్‌లో 26 కేజీల బస్తా రూ.1,150 పలికిన బియ్యం ఇప్పుడు రూ.1,550కి చేరింది. అదే మాల్స్ మరో రూ.100 అదనంగా చెల్లించాలి. ప్రస్తుత మార్కెట్లో బ్రాండెడ్ మార్కెట్ సన్న బియ్యం నాలుగు నెలల క్రితం కిలో 45 ఉండగా, ప్రస్తుతం రూ.60 నుంచి రూ.62 వరకు ధర పలుకుతోంది. ఇదే సమయంలో పీడీఎస్ బియ్యాన్ని రీసైక్లింగ్ చేసి కొందరు వ్యాపారులు సన్న బియ్యంగా అమ్ముతున్నారు. బియ్యం మార్కెట్‌పై ప్రభుత్వానికి ఆజమాయిషీ లేకపోయింది. ధరలకు కళ్లెం వేయాలని భావిస్తే అధికారులు రిటైల్ మార్కెట్‌పై పడుతున్నారు. తనిఖీల పేరుతో హడావుడి చేస్తున్నారు. రాష్ట్రవ్యాప్తంగా 25 మంది వ్యాపారుల చేతులోనే సన్న బియ్యం మార్కెట్ ఆధారపడిపోయింది. వారు ఎంతంటే అంతే ధర. ధాన్యం కొరత ఉందంటూ ఇప్పుడు ధరలు పెంచేశారు. వాస్తవానికి రైతు వద్ద ధాన్యం ఉన్నప్పుడు తక్కువ ధరకు కొనుగోలు చేస్తున్నారు. రైతుల నుంచి సన్న రకాలు పూర్తిగా కొనుగోలు చేసిన తర్వాత ధాన్యం ధరలు పెంచుతున్నారు. మరోవైపు వరుసగా మూడేళ్లుగా దిగుబడులు తక్కువగా ఉండడంతో పాటు ఇటీవల మిచౌంగ్ తుఫాన్‌కు వరి పంటకు తీవ్రనష్టం వాటిల్లింది. ఈ ప్రభావం గణనీయంగా ఉంటుందని అంచనా వేస్తున్నారు.

గతంలో ప్రభుత్వాలు కట్టడి చేసేవి

బియ్యం ధరలు పెరిగితే గతంలో ప్రభుత్వాలు రంగంలోకి దిగేవి. వ్యాపారులే తక్కువ ధరలకు సన్నబియ్యం విక్రయించేలా చర్యలు చేపట్టేవి. చాంబర్ ఆఫ్ కామర్స్ ఆధ్వర్యంలో అమ్మకాలు సాగించేవారు. ఆ తర్వాత ధరలు అదుపులోకి వచ్చేవి. వైసీపీ ప్రభుత్వ హయాంలో ధరలను బొత్తిగా పట్టించుకోవడం లేదు. వ్యాపారులను కట్టడి చేయలేకపోతున్నారు. ప్రభుత్వ పెద్దలను శాసించే స్థితిలో బడా వ్యాపారులున్నారు

పన్ను పేరుతో దగా

మార్కెట్‌లో 25 కిలోలు ప్యాకెట్‌లకు జీఎస్టీ అమలు చేస్తున్నట్టు ప్రభుత్వం ప్రకటించిన తక్షణమే రూ.100 పెంచారు. అప్పటి నుంచి మార్కెట్‌లో ధరలు పెంచుతూ వస్తున్నారు. కానీ ప్రభుత్వానికి పన్ను చెల్లించడం లేదు. బియ్యంపై పన్ను లేనప్పుడు తక్కువ ధరకే బియ్యం లభ్యమయ్యేవి. ధరలు పెంచేందుకు వ్యాపారులు సాహసించే వారు కాదు. ఇప్పుడా పరిస్థితి లేదు. పన్ను పేరుతో ధరలు పెంచేస్తున్నారు. పన్ను చెల్లించకుండా ప్రభుత్వాన్ని, ధాన్యానికి ధర ఇవ్వకుండా రైతులను, ధరలు పెంచుతూ వినియోగ దారులను బడా వ్యాపారులు దగా చేస్తున్నారు. రాష్ట్ర ప్రభుత్వం దీనిపై ఏమీ ఆలోచించడం లేదు. బియ్యం దొంగ వ్యాపారం చేసిన వారికే తాళాలు అప్పగించింది. వారికే రాష్ట్రంలో కీలక బాధ్యతలు అప్పగించింది. అధికార పార్టీ అండదండలు ఉండడంతో సదరు వ్యాపారి బియ్యం ఎగుమతుల్లో ఆరితేరిపోయారు. 'సామాన్య, మధ్యతరగతి ప్రజలపై పెరిగిన బియ్యం ధరలతో పెనుభారం పడుతోంది. బియ్యం, ఉల్లితో పాటు నిత్యావసర వస్తువులు, కూరగాయల ధరలు మండిపోతుండగా, ఏం చేయాలో అర్థం కావడం లేదు' అంటూ ఏలూరుకు చెందిన చిరువ్యాపారి మల్లిపూడి రాజు వాపోయాడు. 'బియ్యం ధరలు ఇలా పెరుగుతూ పోతే సామాన్యులు బతకడం కష్టం. ప్రజలు అర్ధాకలితో అలమటించాల్సి వస్తుంది. బియ్యం ధరలు పెరగడానికి గల కారణాలను ఆరాతీసి నియంత్రణకు ప్రభుత్వం చొరవ చూపాలి. సామాన్య ఇబ్బందులను పట్టించుకోవడం లేదు'.. అని ఏలూరుకు చెందిన గృహిణి పలగాని దుర్గాదేవి ఆవేదన వ్యక్తం చేశారు.

4,531 కొత్త రేషన్ కార్డులు

- ఈ నెల నుంచే నిత్యావసర సరుకుల పంపిణీ

ఏలూరు సిటీ, జనవరి 5 : ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వం ప్రజా పంపిణీ వ్యవస్థ ద్వారా ఏలూరు జిల్లాకు సంబంధించి 4,531 రేషన్ కార్డులను మంజూరు చేశారు. వీరందరికీ ఈ నెల నుంచే రేషన్ పంపిణీ చేస్తారు. జిల్లాలో ప్రస్తుతం 6,30,215 రేషన్ కార్డులు ఉండగా కొత్తగా మంజూరైన రేషన్ కార్డులతో కలిపి మొత్తం 6,34,746 రేషన్ కార్డులకు పోర్టిఫైడ్ బియ్యం, సబ్సిడీపై నిత్యావసర సరుకులు అందజేస్తారని జేసీ లావణ్య వేణి తెలిపారు. మండలాల వారీగా కొత్త బియ్యం కార్డుల వివరాలు ఇలా ఉన్నాయి.

మండలం	కొత్తకార్డులు	మండలం	కొత్తకార్డులు
ఏలూరు	571	దెందులూరు	185
నూజివీడు	251	భీమడోలు	152
ద్వారకాతిరుమల	187	కామవరపుకోట	145
కలిదిండి	183	బుట్టాయిగూడెం	103
కైకలూరు	145	కొయ్యలగూడెం	167
లింగపాలెం	140	మండవల్లి	122
నిడమర్రు	172	పెదపాడు	174
ఉంగుటూరు	191	వేలేరుపాడు	24
చింతలపూడి	260	జీలుగుమిల్లి	41
చాట్రాయి	118	కుక్కునూరు	49
ఆగిరిపల్లి	150	ముదినేపల్లి	116
పోలవరం	108	ముసునూరు	118
జంగారెడ్డిగూడెం	292	పెదవేగి	213
టి.నరసాపురం	148	**మొత్తం**	**4,531**

14,707 ఉజ్వల కనెక్షన్లు

ఏలూరు సిటీ, జనవరి 5 : జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు అర్హులందరికీ ఉజ్వల్ గ్యాస్ కనెక్షన్లు అందజేయాలని జిల్లా పౌర సరఫరాల శాఖ నిర్ణయించింది. పేదవారు, దారిద్ర్యరేఖకు దిగువన ఉన్న వారందరూ ప్రధానమంత్రి ఉజ్వల్ యోజన పథకానికి అర్హులు. భారత పెట్రోలియం, సహజ వాయువు మంత్రిత్వశాఖ కట్టెలు, బొగ్గు ఆవుపేడ మొదలైన సంప్రదాయ వంట ఇంధనాలను ఉపయోగించే గ్రామీణ, నిరాశ్రయులైన కుటుంబాలకు ఎల్‌పీజీ వంటి స్వచ్ఛమైన వంట ఇంధనాన్ని అందుబాటులోకి తీసుకొచ్చే లక్ష్యంతో ప్రధాన మంత్రి ఉజ్వల్ యోజన (పీఎంయూవై) ఒక ప్రధాన పథకంగా ప్రవేశ పెట్టారు. ఇప్పటివరకు జిల్లాలోని అర్హులైన 14,707 మంది లబ్ధిదారులకు గ్యాస్ కనెక్షన్లతో పాటు గ్యాస్ పొయ్యిలు ఉచితంగా అందజేశారు. జిల్లాలో ఇంకా అర్హులెవరైనా ఉంటే ఈ కనెక్షన్లు పొందాలని జిల్లా పౌరసరఫరాల శాఖాధికారి ఆర్ఎస్ఎస్ సత్యనారాయణ రాజు శుక్రవారం 'ఆంధ్రజ్యోతి'కి తెలిపారు. ప్రధానమంత్రి ఉజ్వల్ పథకం కింద ఉచితంగా గ్యాస్ కనెక్షన్ పొందడం కోసం లబ్ధిదారులు అధిక సంఖ్యలో గ్యాస్ ఏజెన్సీలకు వెళ్ళుతుండడంతో అక్కడ రద్దీ విపరీతంగా పెరుగుతోంది. ఈ కనెక్షన్ పొందేందుకు దరఖాస్తుదారుకు (మహిళ మాత్రమే), తప్పనిసరిగా 18 ఏళ్లు నిండి ఉండాలి. ఒకే ఇంటిలో ఏ ఓఎంసీ నుంచి ఇతర ఎల్‌పీజీ గ్యాస్ కనెక్షన్ ఉండరాదు.






ఆచంట సభాస్థలి వద్ద ఏర్పాట్లు పర్యవేక్షిస్తున్న పితాని తనయుడు వెంకట్, హెలీప్యాడ్ ప్రాంతాన్ని పరిశీలిస్తున్న టీడీపీ నేతలు, సభా ప్రాంగణంలో టీడీపీ, జనసేన జెండాల రెపరెపలు, ముదునూరులో నాయకులను కలిసిన వలవల బాబ్జి

శరవేగంగా సభావేదిక పనులు

» తోరణాలతో సభాప్రాంగణం ముస్తాబు

» రెపరెపలాడుతున్న పసుపు జెండాలు

ఆచంట, జనవరి 5 : ఆచంటలో ఆదివారం జరిగే టీడీపీ అధినేత చంద్రబాబు బహిరంగసభకు సభావేదిక ముస్తాబవుతోంది. ఆచంట-మార్టేరు రోడ్డు సమీపంలో ఏర్పాటు చేసిన సభావేదిక పనులు శరవేగంగా జరుగుతున్నాయి. సబా వేదిక చుట్టూ టీడీపీ జెండాలు, తోరణాలు కట్టడంతో అంతా పసుపుమయంగా మారింది. సభావేదిక ద్వారం కూడా ముస్తాబుచేశారు. ఈ సభకు జిల్లా నుంచి లక్ష మంది జనం వచ్చేలా ఏర్పాట్లు చేస్తున్నట్టు నేతలు తెలిపారు. తహసీల్దార్ కార్యాలయం పక్కన చంద్రబాబు దిగే హెలీప్యాడ్ ప్రాంతం కూడా సిద్ధమైంది. తొలుత చంద్రబాబు హెలీప్యాడ్ నుంచి సభావేదిక వద్దకు ర్యాలీగా రానున్నారు. ఈ మేరకు జిల్లా నుంచి ఆచంట వస్తున్న నేతలతో ఆచంట సందడి మారింది. సభావేదిక వద్ద మాజీ మంత్రి పితాని తనయుడు వెంకట్ ఏర్పాట్లు పర్యవేక్షిస్తున్నారు. ఉప్పలపాటి సురేష్‌బాబు, గొడవర్తి శ్రీరాములు, గణపతినీడి రాంబాబు, తమ్మినీడి ప్రసాద్, మీరయ్య, చిలుకూరి సీతారామ్ తదితరులు ఉన్నారు.




పెనుగొండ సమావేశంలో మాట్లాడుతున్న మాజీ మంత్రి పితాని, నరసాపురం సమావేశంలో మాట్లాడుతున్న పొత్తూరి, కొవ్వలి తదితరులు

చంద్రబాబు సభ విజయవంతం చేద్దాం

మాజీ మంత్రి పితాని

ఆచంట/పెనుగొండ, జనవరి 5 : 'రా కదలి రా' బహిరంగ సభకు జిల్లా నలుమూలల నుంచి పెద్ద సంఖ్యలో జనం హాజరై విజయవంతం చేయాలని మాజీ మంత్రి పితాని సత్యనారాయణ అన్నారు. శుక్రవారం ఆచంటలో సభాస్థలి వద్ద, పెనుగొండ మండలం పెనుగొండ టీడీపీ కార్యాలయంలో కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడుతూ వైసీపీ పాలనలో ప్రజలకు జరుగుతున్న అన్యాయాన్ని ఆచంట సభలో ప్రజానికానికి చెబుతామన్నారు. ఆచంట మండం ఆచంట వీరవల్లివారి వీధిలో నిర్వహించిన కార్యకర్తల సమావేశంలో పార్టీ మండలశాఖ అధ్యక్షుడు కొల్లేపర శ్రీనివాసరావు, ఎంపీపీ వీరవల్లి దుర్గాభవాని మాట్లాడుతూ చంద్రబాబు సభకు వేలాది మంది కార్యకర్తలను తరలి వచ్చేందుకు ఏర్పాట్లు చేశామన్నారు.

● నరసాపురం టౌన్/మొగల్తూరు : ఆచంటలో నిర్వహించే 'రా కదలిరా సభ' ఎన్నికలకు పునాది అని తెలుగుదేశం రాష్ట్ర కార్యదర్శి, ఆచంట సభ పరిశీలకుడు బొడ్డు వెంకటరమణ సూచించారు. శుక్రవారం మొగల్తూరులో పార్టీ మండల అధ్యక్షుడు గుబ్బల నాగరాజు కార్యాలయంలో నిర్వహించిన కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. తెలుగుదేశం, జనసేన కూటమిని అధికారంలోకి తీసుకువచ్చేందుకు ప్రజలంతా సుముఖంగా ఉన్నారన్నారు. నరసాపురం టీడీపీ కార్యాలయంలో టీడీపీ ఇన్‌చార్జి పొత్తూరి రామరాజు, కొవ్వలి నాయుడు మాట్లాడుతూ నియోజకవర్గం నుంచి ఆచంట సభకు మధ్యాహ్నం రెండు గంటలకు నరసాపురం పార్టీ కార్యాలయం నుంచి పది వేల మంది తరలివెళ్లేలా ఏర్పాట్లు చేశామన్నారు. నియోజకవర్గ పరిశీలకుడు గుత్తుల సాయి, పార్టీ మండల అధ్యక్షుడు గుబ్బల నాగరాజు, పట్టణ అధ్యక్షుడు బస్వాని ఏడుకొండలు, సత్తినేని సర్వేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

● యలమంచిలి : ఆచంటలో టీడీపీ బహిరంగ సభకు నాయకులు, కార్యకర్తలు, ప్రజలు తరలిరావాలని టీడీపీ వాణిజ్యవిభాగ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి బోళ్ల వెంకటరమణ పిలుపునిచ్చారు. మండలంలోని పలు గ్రామాల్లో టీడీపీ, జనసేన శ్రేణులతో శుక్రవారం సమావేశాలు నిర్వహించారు. కాజ గ్రామంలో ఆయన మాట్లాడుతూ అభివృద్ధి ప్రదాత చంద్రబాబుకు అన్ని వర్గాల ప్రజలు మద్దతుగా నిలవాలని కోరారు. పార్టీ మండల అధ్యక్షుడు మామిడిశెట్టి పెద్దిరాజు, కడలి గోపి తదితరులు పాల్గొన్నారు.

జగన్ పాలనలో విసుగెత్తిన ప్రజలు

» చంద్రబాబు సభకు తరలిరావాలని ఎమ్మెల్యే మంతెన పిలుపు



అబ్బర్వర్ బుచ్చిబాబును సన్మానిస్తున్న ఎమ్మెల్యే రామరాజు

ఆకివీడు/ఉండి, జనవరి 5: రాష్ట్ర ప్రజలు సైకో జగన్‌ను తరిమికొట్టి చంద్రబాబును సీఎం చేయడానికి తహతహలాడుతున్నారని ఎమ్మెల్యే మంతెన రామరాజు, అబ్బర్వర్ బుచ్చిబాబు అన్నారు. శుక్రవారం ఆకివీడు టీడీపీ కార్యాలయం, ఉండి మండలంలోని పలు గ్రామాల్లో నిర్వహించిన కార్యకర్తల సమావేశంలో ఆదివారం జరిగే రా..కదలిరా సభ కార్యక్రమంపై ఆయన మాట్లాడారు. ప్రతీ వ్యవస్థను జగన్ చిన్నాభిన్నంతో ప్రజలు విసుగెత్తిపోయారని అన్నారు. ఆకివీడులో పార్టీ మండల-పట్టణ అధ్యక్షులు మోటుపల్లి రామవర ప్రసాద్, బొల్లా వెంకట్రావు, డీసీసీబీ మాజీ చైర్మన్ ముత్యాల రత్నం, తిమ్మరాజు, నాగబాబు, గంధం ఉమా, తోట అర్జునరావు తదితరులు పాల్గొన్నారు.

చంద్రబాబు సభను జయప్రదం చేద్దాం : వలవల

పెంటపాడు, జనవరి 5 : ఆచంటలో ఆదివారం జరిగే టీడీపీ అధినేత చంద్రబాబు సభను జయప్రదం చేద్దామని టీడీపీ తాడేపల్లిగూడెం నియోజకవర్గ ఇన్‌చార్జి వలవల బాబ్జి, నియోజకవర్గ పరిశీలకుడు నక్కా చిట్టిబాబు తెలిపారు. శుక్రవారం పెంటపాడు మండలంలో పలు గ్రామాల్లో పర్యటించి స్థానిక నాయకులతో సమావేశాలు నిర్వహించి మాట్లాడారు. నియోజకవర్గం నుంచి 90 బస్సులు, కార్లు ఏర్పాటు చేస్తున్నట్టు తెలిపారు. కిలపర్తి వెంకట్రావు, గంధం సతీశ్, కాశీ నవీన్‌కుమార్, షేక్ సుభాన్, పాతూరి రాంప్రసాద్‌చౌదరి తదితరులు పాల్గొన్నారు.

సౌత్‌జోన్ జేఎన్‌టీయూ మహిళా హ్యాండ్ బాల్ జట్టు ఎంపిక



జేఎన్‌టీయూ మహిళా హ్యాండ్ బాల్ జట్టు క్రీడాకారులు

దెందులూరు, జనవరి 5 :విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లోనూ రాణించాలని హేలాపూరి ఇంజనీరింగ్ కాలేజీ సెక్రటరీ అట్లూరి శ్రీనివాస్ అన్నారు. శుక్రవారం గోపన్నపాలెం పరిధిలోని వేగవరం హేలాపురి ఇంజనీరింగ్ కాలేజీలో రాజమండ్రికి చెందిన జేఎన్‌టీయూ యూనివర్సిటీ పరిధిలోని ఐదు జిల్లాల్లోని కాలేజీలకు చెందిన సౌత్ జోన్ అంతర యూనివర్సిటీల జేఎన్‌టీయూ మహిళా హ్యాండ్ బాల్ జట్టు ఎంపిక పోటీలు నిర్వహించారు. కాలేజీ ఏవో కరుణానిధి ఆధ్వర్యంలో 150 మంది పాల్గొనగా 16 మందితో జట్టును ఎంపిక చేశామన్నారు. వీరు ఈనెల 10వ తేదీ నుంచి 14వ తేదీ వరకు తమిళనాడులో జరిగే సౌత్ జోన్ యూనివర్సిటీల పోటీలకు రాజమండ్రి జేఎన్‌టీయూ జట్టు తరపున పాల్గొంటుందన్నారు. ఎంపికైనా క్రీడాకారులకు పలువురు అభినందించారు.

క్రీడలతో మానసిక ఉల్లాసం

» అండర్ -13,14,15 బ్యాడ్మింటన్ పోటీలు ప్రారంభం



బ్యాడ్మింటన్ టోర్నమెంట్‌ను ప్రారంభించిన మోషేన్‌రాజు

భీమవరంటౌన్, జనవరి 5 : క్రీడలు మానసిక ఉల్లాసాన్ని ఉత్సాహాన్ని అందిస్తాయని రాష్ట్ర శాసనమండలి చైర్మన్ కొయ్యే మోషేన్‌రాజు అన్నారు. భీమవరం అంగర విజయలక్ష్మి కన్నయ్య ఇండోర్ స్టేడియంలో శుక్రవారం అంగర కన్నయ్య మెమోరియల్ ఆంధ్రప్రదేశ్ సబ్ జూనియర్ అండర్-13,14,15 బ్యాడ్మింటన్ టోర్నమెంట్‌ను ఆయన ప్రారంభించారు. అకాడమీ చీఫ్ కోచ్ ఎ.వెంకటేశ్వరరావు మాట్లాడుతూ మూడు రోజులపాటు బాయ్స్, గర్ల్స్ సింగిల్, డబుల్స్ విభాగంలో పోటీలు జరుగుతాయన్నారు. విజేతలకు లక్ష రూపాయల బహుమతులు అంది స్తామన్నారు. డీఎస్పీ శ్రీనాథ్, గాదిరాజు సుబ్బరాజు, ఇండియా కోచ్ మురళీకృష్ణ, జిల్లా బ్యాడ్మింటన్ కార్యదర్శి మెంటే వంశీకృష్ణ, డాక్టర్ రఘు తదితరులు పాల్గొన్నారు.

ఓపెన్ పరీక్షల ఫీజు చెల్లింపునకు గడువు19

ఏలూరు ఎడ్యుకేషన్, జనవరి 5 : ఏపీ ఓపెన్‌స్కూల్స్ టెన్త్, ఇంటర్ పరీక్షల ఫీజును ఈనెల 19 లోగా చెల్లించాలని డీఈవో శ్యాంసుందర్ ఓ ప్రకటనలో పేర్కొన్నారు. మార్చి 18 నుంచి 27 వరకు పరీక్షలు జరుగుతాయన్నారు. ఏమైనా సందేహాలుంటే ఓపెన్ స్కూల్స్ అధీకృత సెంటర్లనుగాని, ఏలూరు డీఈవో కార్యాలయంలోగాని సంప్రదించాలని సూచించారు.

31న ఎమ్మెల్సీల రాష్ట్రస్థాయి సదస్సు

భీమవరం, జనవరి 5 : శాసన మండలిలో ఎమ్మెల్సీలు పాటించాల్సిన విధి, విధానాలపై భీమవరంలో ఈనెల 31న ఎమ్మెల్సీల రాష్ట్రస్థాయి సదస్సు నిర్వహిస్తున్నట్టు రాష్ట్ర శాసన మండలి చైర్మన్ కొయ్యే మోషేన్‌రాజు తెలిపారు. శుక్రవారం భీమవరంలోని ఆయన క్యాంపు కార్యాలయంలో కలెక్టర్ పి.ప్రశాంతి, జిల్లా ఎస్పీ యు.రవి ప్రకాశ్‌లతో కలిసి ఎమ్మెల్సీల సదస్సు నిర్వహణపై సమీక్షించారు. ఆయన మాట్లాడుతూ శాసనమండలి విధి, విధానాల్లో క్వశ్చన్ అవర్, షార్టు డిస్కషన్స్ సభలో సభ్యులు వ్యవహరించాల్సిన తీరు, అనుసరించవలసిన నిబంధనలు, తదితర అంశాలపై రాష్ట్రంలోని అన్ని జిల్లాల ఎమ్మెల్సీలకు అవగాహన కల్పిస్తామన్నారు. భీమవరం బీవీరాజు కాలేజ్‌లో నిర్వహించేందుకు పరిశీలిస్తున్నట్టు తెలిపారు. రాష్ట్ర అసెంబ్లీ సెక్రటరీ జనరల్ పీపీకే రామాచార్యులు, జాయింట్ సెక్రెటరీ విజయ రాజు, సహాయ కార్యదర్శులు శ్రీనివాసరావు, విశ్వనాథ్, పశ్చిమ గోదావరి డీఆర్వో బి.శివన్నారాయణ, భీమవరం ఆర్డీవో కె.శ్రీనివాసులురాజు, మునిసిపల్ కమిషనర్ కె.శ్యామల పాల్గొన్నారు.

మహిళకు కొవిడ్ పాజిటివ్

ఏలూరు ఎడ్యుకేషన్, జనవరి 5 :ఏలూరు నగర పరిధిలో ఓ మహిళ (50)కు శుక్రవారం కొవిడ్ పాజిటివ్ నిర్ధారణ అయింది. ప్రస్తుతం ఆమె హోం ఐసోలేషన్‌లో ఉన్నారని, ఆరోగ్యం స్థిరంగా ఉందని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ వర్గాలు వెల్లడించాయి. ఇటీవల కొవిడ్ జేఎన్-1 వేరియంట్ నిర్ధారణ అయిన ఓ ప్రైవేటు ఆస్పత్రి వైద్యుడు పూర్తి ఆరోగ్యంతో కోలుకున్నారని వైద్యవర్గాలు తెలిపాయి. తాజాగా వెలుగులోకి వచ్చిన కేసుతో కలుపుకుని జిల్లాలో ప్రస్తుతం ఐదు యాక్టివ్ కేసులున్నాయి.

పోలీస్ స్పోర్ట్స్ మీట్ ప్రారంభం



క్రీడా జ్యోతిని వెలిగిస్తున్న ఎస్పీ మేరీప్రశాంతి

ఏలూరు క్రైం, జనవరి 5 : పోలీస్ సిబ్బందిలో క్రీడా ప్రతిభను వెలికితీ యడానికి 'పోలీస్ స్పోర్ట్స్ మీట్' ఎంతో దోహదపడుతుందని ఏలూరు జిల్లా ఎస్పీ మేరీ ప్రశాంతి అన్నారు. ఏలూరు పోలీస్ పరేడ్ గ్రౌండ్‌లో శుక్రవారం పోలీస్ స్పోర్ట్స్ మీట్‌ను నిర్వహించారు. తొలుత క్రీడాకారుల నుంచి గౌరవవందనాన్ని ఆమె స్వీకరించారు. క్రీడలు ప్రారంభం సందర్భంగా క్రీడా జ్యోతిని ఆమె వెలిగించారు. ఆమె మాట్లాడుతూ 24 గంటలు విధి నిర్వహణలో ఉండే పోలీస్ సిబ్బందికి ఈ క్రీడలు మానసిక ఉల్లాసంతో పాటు వారిలో ఉన్న క్రీడాప్రతిభకు గుర్తింపు వస్తుందన్నారు. జిల్లా స్థాయి స్పోర్ట్స్ మీట్‌లో ప్రతిభ చూపిన వారికి రాష్ట్ర పోలీస్ మీట్‌కు పంపిస్తామన్నారు. కబడ్డీ, వాలీబాల్, అథ్లెటిక్, హాకీ, 100 మీటర్లు, 400 మీటర్లు, 800 మీటర్ల పరుగుపందెం, హైజంప్, లాంగ్ జంప్, ఫుట్‌బాల్, టెన్నీస్, షటిల్ మొదలగు క్రీడలు నిర్వహిస్తామన్నారు. శనివారం సాయంత్రంతో ఈ క్రీడలు ముగుస్తాయన్నారు. ఎస్ఈబీ అదనపు ఎస్పీ నక్కా సూర్యచంద్రరావు, ఏఆర్ అదనపు ఎస్పీ ఎస్ఎస్ శేఖర్, ఏలూరు డీఎస్పీ శ్రీనివాసులు, ఏఆర్‌డీఎస్పీ చంద్రశేఖర్, సీఐ ఆదిప్రసాద్, ఆర్ఐ పవన్‌కుమార్, మహిళా ఎస్ఐలు పాల్గొన్నారు.

క్రైం కార్నర్

రైలు పట్టాలపై వృద్ధుడి అనుమానాస్పద మృతి

ఏలూరు క్రైం, జనవరి 5 : ఏలూరు గన్‌బజార్ రైల్వే పట్టాల వద్ద ఒక వృద్ధుడు అనుమానాస్పద స్థితిలో మృతిచెంది ఉన్నట్టు ఏలూరు రైల్వే ఎస్ఐ నరసింహారావుకు సమాచారం అందింది. సిబ్బందితో శుక్రవారం వెళ్లి పరిశీలించగా ఏలూరు కొత్తపేటకు చెందిన కోనా కొండలరావు(74) ఏలూరులోని ఓ కంపెనీలో పదేళ్లుగా సెక్యూరిటీ గార్డుగా పనిచేస్తున్నాడు. ఈనెల 4వ తేదీ రాత్రి 8 గంటల ప్రాంతంలో డ్యూటీకి వెళ్లేందుకు ఇంటి నుంచి బయలుదేరి వెళ్లి గన్‌బజార్ వద్ద రైలు పట్టాలుదాటుతూ అనారోగ్య కారణంతో పడి మృతి చెందాడు. అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసిన రైల్వే పోలీసులు మృతదేహాన్ని ఏలూరు ప్రభుత్వాసుపత్రికి తరలించి పోస్టుమార్టం నిర్వహించి బంధువులకు అప్పగించారు. గుండెపోటు వల్ల మరణించి ఉంటాడని భావిస్తున్నారు.

కోడిపుంజులు తస్కరించిన ఇద్దరిపై కేసు

ఆకివీడు, జనవరి 5: కోడిపుంజులు దొంగిలిస్తున్న ఇద్దరిని పట్టుకొని పోలీసుల ఫిర్యాదు చేయడంతో ఎస్ఐ బత్తిన నాగబాబు కేసు నమోదు చేశారు. దుంపగడపకు చెందిన జి.నాగరాజు నివాసంలో ఒక్కొక్కటి రూ.5వేలు విలువ చేసే రెండు పెంపుడు కోడిపుంజులను శుక్రవారం స్థానిక గుమ్ములూరు సెంటర్‌కు చెందిన కేతా సాయి, దుంపగడపకు చెందిన సవరపు చైతన్య దొంగిలిస్తుండగా పట్టుకున్నారు. పోలీస్‌స్టేషన్‌కు తీసుకొచ్చి ఫిర్యాదు చేయడంతో ఎస్ఐ కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నారు.

మహిళా దొంగకు రెండేళ్ల జైలు శిక్ష

ఏలూరు క్రైం, జనవరి 5 : పగటి వేళ ఇంటి దొంగతనాలు చేస్తున్న ఒక మహిళా దొంగపై నేరం రుజువు కావడంతో రెండేళ్ల జైలు శిక్ష విధిస్తూ ఏలూరులోని రెండో అదనపు జ్యుడీషియల్ ఫస్ట్ క్లాస్ మేజిస్ట్రేట్ శుక్రవారం తీర్పు చెప్పారు. ప్రాసిక్యూషన్ కథనం ప్రకారం భీమవరంలోని ముచ్చేవారితోటకు చెందిన పందిరి జ్యోతి(25) కొంతకాలం క్రితం ఏలూరులో ఉన్న పుష్పలీలానగర్‌కు వచ్చి అద్దెకు ఉంటుంది. ఆ ప్రాంతంలో పగటి వేళ ఇంటికి తాళాలు వేసి ఉన్న ఇళ్లను ఎంపిక చేసుకుని మారుతాళాలతో ఆ ఇంటి తాళాలు తీసి దొంగతనాలకు పాల్పడుతుంది. ఏలూరుటూటౌన్ పరిధిలో ఏడు నేరాలకు పాల్పడడంతో ఆమెను టూటౌన్ ఎస్ఐ నాగబాబు అరెస్టు చేశారు. కోర్టులో చార్జిషీట్లను దాఖలు చేశారు. ఈ కేసు ఏలూరులోని సెకండ్ ఏజేఎఫ్‌సీఎం కోర్టులో విచారణ సాగింది. నిందితురాలిపై నేరం రుజువు కావడంతో రెండేళ్ల కారాగార శిక్ష, ఒకొక్క కేసుకు రూ.పది వేల చొప్పున జరిమానాను మేజిస్ట్రేట్ వాసుదేవ్ విధించారు. ప్రాసి క్యూషన్ తరఫున ఏపీ పీ జయశ్రీ వాదించగా ప్రాసిక్యూ షన్‌కు ఏలూరు టూటౌన్ సీఐ ప్రభాకరరావు, కోర్టు హెచ్‌సీ సత్యనారా యణ, కానిస్టేబుల్ చిరంజీవి సహకరించారు.

లక్ష్మీగణపతి ఆలయంలో చోరీ

» లక్ష రూపాయల హుండీ నగదు అపహరణ

ఏలూరు క్రైం, జనవరి 5 : ఏలూరు సమీపంలోని సత్రంపాడులో ఉన్న లక్ష్మీగణపతి ఆలయంలో చోరీ జరిగిందని పోలీసులకు ఫిర్యాదు అందడంతో ఏలూరు త్రీటౌన్ పోలీసులు కేసు నమోదు చేశారు. దేవదాయధర్మదాయ శాఖ ఈవో సీహెచ్ చిననాగేశ్వరరావు ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు. సత్రంపాడు లక్ష్మీగణపతి ఆలయంలో ఈనెల 4వ తేదీ రాత్రి యథావిధిగా తాళాలు వేశారు. 5వ తేదీ ఉదయం స్వీపర్ తుడవడానికి వెళ్లగా తాళాలు పగులగొట్టి ఉన్నాయి. వెంటనే ఈ సమాచారం ఈవోకు తెలియడంతో ఈవో నాగేశ్వరరావు త్రీటౌన్ పోలీసులకు సమాచారం అందజేశారు. సీఐ తన సిబ్బందితో ఘటనా స్థలాన్ని పరిశీలించారు. దొంగలు ఆ గుడిలోని హుండీ పగులగొట్టి లక్ష రూపాయలు నగదు అపహరించుకుపోయినట్టు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

యువతి అదృశ్యంపై కేసు నమోదు

భీమవరం క్రైం, జనవరి 5 : భీమవరం గునుపూడికి చెందిన 23 ఏళ్ళ యువతి ఆచూకీ ఈనెల 4వ తేదీ నుంచి తెలియడం లేదని కుటుంబ సభ్యులు ఫిర్యాదు చేశారని పోలీసులు తెలిపారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ ఎస్.హనుమంతరావు శుక్రవారం తెలిపారు.

సున్నిత పర్యావరణ ప్రాంత నిర్ధారణపై సమీక్ష



మాట్లాడుతున్న కలెక్టర్ ప్రసన్న వెంకటేశ్

ఏలూరు కలెక్టరేట్, జనవరి 5: కొల్లేరు ఐదో కాంటూరు చుట్టూ సున్నిత పర్యావరణ ప్రాంత పరిధిలోకి వచ్చే తొమ్మిది మండలాల్లోని 89 గ్రామాల గురించి మండల కేంద్రాల్లో నిర్వహించిన గ్రామసభల ద్వారా సేకరించిన ప్రజాభిప్రాయాలు, ప్రజాప్రతినిధుల అభిప్రాయాలపై శుక్రవారం కలెక్టరేట్‌లో సమీక్షా నిర్వహించారు. కలెక్టర్ ప్రసన్న వెంకటేశ్ మాట్లాడుతూ కొల్లేరు సున్నిత పర్యావరణ ప్రాంత నిర్ధారణకు తీసుకునే చర్యలపై సభ్యులకు వివరించారు. దీనికి సంబంధించి మౌలిక విషయాలను పరిధి ప్రతిపాదనలు సభ్యులకు తెలిపారు. ఎమ్మెల్సీ జయమం గళ వెంకటరమణ మాట్లాడుతూ కొల్లేరు సున్నిత పర్యావరణ ప్రాంతాన్ని గతంలో ఐదో కాంటూరు నుంచి ఒక కిలోమీటర్ పరిధిని ప్రతిపాదించారని సమావేశం దృష్టికి తీసుకొచ్చారు. అయితే ఈ ప్రతిపాదనలు ఎంతవరకు సఫలీకృతం అవుతాయోనని అధికారులు అనుమానం వ్యక్తం చేశారు. కైకలూరు ఎమ్మెల్యే దూలం నాగేశ్వరరావు, కమిటీ సభ్యులు, అటవీ, వన్యప్రాణ విభాగం అధికారులు పాల్గొన్నారు.

పవన్ కల్యాణ్‌కు జోగయ్య బహిరంగ లేఖ

పాలకొల్లు, జనవరి 5: సీఎం జగన్మోహన్‌రెడ్డి మరోసారి అధికారం చేపట్టటమే ధ్యేయంగా నవరత్నాల పేరుతో కొనసాగిస్తున్న సంక్షేమ పథకాల పైనే ఆధార పడిన మాట వాస్తవం. 'సంక్షేమాన్ని సంక్షేమంతోనే కొట్టవలసి ఉంది. రాబో యే ఎన్నికల్లో వైసీపీ ప్రభుత్వ ప్రజావ్యతిరేక విధానాలను ఎండగ ట్టడంతో పాటు జనసేన, తెలుగుదేశం ఉమ్మడి మేనిఫెస్టో ద్వారా ప్రజలకు ముఖ్యంగా పేదరికంలో మగ్గుతున్న వారికి హామీలు ఇవ్వడం ద్వారా వారిని సంతృప్తి పరచటంతో విజయానికి దగ్గరపడడం ఎంత అవసరమో మీరు తెలుసుకో వాల్సి ఉంది' అంటూ రాష్ట్ర కాపు సంక్షేమ సేనా అధ్యక్షుడు చేగొండి హరిరామ జోగయ్య శుక్రవారం జనసేన అధినేత పవన్ కల్యాణ్‌కు బహిరంగ లేఖ రాశారు. ఈలేఖను శుక్రవారం పశ్చిమగోదావరి జిల్లాలో పత్రికా విలేకరులకు అందచేశారు.

పోస్టాఫీస్ ప్రహరీని ఢీకొట్టిన స్కూల్ బస్సు

» పిల్లలకు తప్పిన పెనుప్రమాదం



స్కూల్ బస్సు చుట్టూ స్థానికులు

ద్వారకాతిరుమల, జనవరి 5 : స్కూల్ బస్సుకు ఫిట్‌నెస్ లోపించడం, డ్రైవర్ నిర్లక్ష్యం వెరసి స్థానిక న్యూకీర్తి ఇంగ్లీష్ మీడియం స్కూల్‌బస్సు ఎత్తు నుంచి పల్లానికి దూసుకెళ్లి పోస్టాఫీసు గోడను ఢీకొట్టింది. బస్సులో ఉన్న స్కూల్‌పిల్లలు తీవ్రభయాందోళనలతో హాహాకారాలు చేశారు. వారికి ఏవిధమైన ప్రమాదం జరుగక పోవడంతో స్థానికులు ఊపిరి పీల్చుకున్నారు. ద్వారకాతిరుమల పోలీసులు కేసు నమోదు చేశారు. స్థానికులు పోలీసులు తెలిపిన వివరాలివి.. మండలంలోని దొరసానిపాడు వద్ద ఈ స్కూల్‌ను నిర్వహిస్తున్నారు. అక్కడ నుంచి ద్వారకాతిరుమలకు సుమారు 50 మంది పిల్లలతో పాటు ముగ్గురు ఉపాధ్యాయులతో బస్సు బయలుదేరి స్థానిక పోస్టాఫీస్ వద్ద వేరే డ్రైవర్‌ను మార్చేందుకు టైరు కింద రాయి ఉంచి నిలుపుదల చేశాడు. మరో డ్రైవర్ బస్సు తీసేందుకు గాను టైరుకింద ఉంచిన రాయిని తొలగించాడు. ఎత్తు ప్రదేశంలో ఉన్న బస్సు ఒక్కసారిగా వెనక్కి వెళ్లి పోస్టల్ కార్యాలయ ప్రహరీని ఢీకొట్టింది. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

సమగ్రశిక్ష ఉద్యోగులకు నోటీసుల జారీ నేటికి వాయిదా

ఏలూరు ఎడ్యుకేషన్, జనవరి 5 : గత 17 రోజులుగా సమ్మె చేస్తున్న సమగ్రశిక్ష అవుట్‌సోర్సింగ్, పార్ట్‌టైం ఉద్యోగుల ఆందోళనను అణచివేసేందుకు చర్యలు చేపట్టిన ప్రభుత్వం విధులకు హాజరుకాని ఉద్యోగులకు షోకాజ్ నోటీసులను జారీచేసే ప్రక్రియను శనివారానికి వాయిదా వేసింది. శుక్రవారం ఎస్ఎస్ఏ రాష్ట్ర కార్యాలయం వద్ద ఉద్యోగులు చేపట్టిన ధర్నా సదర్భంగా ఉద్యోగ సంఘాల నాయకులతో ఉన్నతాధికారులు జరిపిన చర్చల్లో ప్రధాన డిమాండ్లలో ఒకటైన హెచ్‌ఆర్ పాలసీని అమలు చేయడానికి ప్రభుత్వం నుంచి సానుకూల స్పందనరాగా, మిగతా డిమాండ్లపై చర్చలు ఇంకా ఒక కొలిక్కిరాలేదని ఉద్యోగవర్గాలు వివరించాయి. ఇరుపక్షాల మధ్య సయోధ్యకు యత్నాలు జరుగుతుండడం వల్లే తొలుత అనుకున్నట్టుగా శుక్రవారం నోటీసులు జారీచేయలేక పోయామని, ఆమేరకు వేచిచూచే ధోరణిలో వున్నట్టు జిల్లా ఎస్ఎస్ఏ అధికారవర్గాలు తెలిపాయి. ఈ క్రమంలోనే శనివారం ఉదయం వరకు వేచి చూస్తామని, అప్పటికీ విధుల్లోకి హాజరుకాని ఉద్యోగులకు నోటీసులు జారీ చేస్తామని అధికారవర్గాలు వివరించాయి.

పోలవరంలో బుల్డోజర్ డ్రైవర్ మృతి

పోలవరం, జనవరి 5 : పోలవరం ప్రాజెక్ట్ కాఫర్ డ్యామ్‌ల నడుమ గురువారం సాయంత్రం ఇసుక లెవెల్ చేస్తున్న బుల్డోజర్ గోదావరి నది అగాథంలో పడిన దుర్ఘటనలో డ్రైవర్ మృతి చెందాడు. అతడి మృతదేహం శుక్రవారం లభ్యమైంది. పోలవరం ఎస్ఐ పవన్‌కుమార్ తెలిపిన వివరాలివి.. ఎగువ, దిగువ కాఫర్ డ్యామ్‌ల నడుమ బుల్డోజర్‌తో ఇసుక లెవెలింగ్ పనులను అమలాపురానికి చెందిన డ్రైవర్ జెల్లి నాగేశ్వరరావు(45) చేస్తున్నాడు. ఆ సమయంలో బుల్డోజర్‌తో సహా సుమారు 60 అడుగుల లోతు అగాథంలో మునిగిపోయాడు. విషయం తెలుసుకున్న పోలీసులు, ప్రాజెక్ట్ అధికారులు గాలింపు చర్యలు చేపట్టారు. శుక్రవారం ఉదయం గల్లంతైన నాగేశ్వరరావు మృతదేహాన్ని రెస్క్యూ టీం సభ్యులు గాలించి వెలికి తీశారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం పోలవరం తరలించినట్టు ఎస్ఐ తెలిపారు.

నయనానందకరం.. ధనుర్మాస ఉత్సవం



దివ్యమూర్తుల ఊరేగింపు

ద్వారకాతిరుమల, జనవరి 5 : శ్రీవారి తిరువీధిసేవ శుక్రవారం ఉదయం క్షేత్రపురవీధుల్లో నయనానందకరంగా సాగింది. ఈ క్రమంలో స్వామివారు, ఉభయదేవేరులు, గోదాదేవితో కలసి అట్టహాసంగా ఊరేగారు. ధనుర్మాస ఉత్సవాలను పురస్కరించుకుని ముందుగా ఆలయ ప్రాంగణంలో తొళక్క వాహనంపై శ్రీవారు, అమ్మవార్లతో పాటు గోదాదేవి ఉత్సవమూర్తులను ఉంచి అర్చకులు పుష్పాలంకరణ చేశారు. ఆ తరువాత మేళతాళాలు, డోలు సన్నాయి వాయిద్యాలు, భక్తుల గోవిందనామస్మరణల నడుమ పురవీధుల్లో ఊరేగిం చారు. ప్రతీ ఇంటిముందు భక్తులు స్వామి, అమ్మవార్లకు హారతులు పట్టారు.

చేబ్రోలులో దీన్‌దయాళ్ విగ్రహం ఆవిష్కరణ



దీన్‌దయాళ్ విగ్రహాన్ని ఆవిష్కరించిన భారతి ప్రవీణ్‌పవార్, పురందేశ్వరి

ఉంగుటూరు, జనవరి 5 : చేబ్రోలులో బీజేపీ సిద్ధాంతకర్త దీన్‌దయాళ్ విగ్రహాన్ని కేంద్రవైద్య ఆరోగ్య శాఖ మంత్రి భారతి ప్రవీణ్‌పవార్, పార్టీ రాష్ట్ర అధ్యక్షురాలు దగ్గుబాటి పురందేశ్వరి శుక్రవారం రాత్రి ఆవిష్కరించారు. అనంతరం జిల్లా అధ్యక్షుడు చౌటపల్లి విక్రమ్‌కిషోర్ అధ్యక్షతన సభ నిర్వహించారు. ఈ సందర్భంగా పురందేశ్వరి మాట్లాడుతూ దీన్ దయాళ్ అంత్యోదయ సిద్ధాంతం ద్వారా పదవిలోకి వచ్చిన వారెవ్వరూ అహంకార పూరితంగా అధికారం చెలాయించవద్దని ఈ విషయాన్ని ప్రతి బీజేపీ కార్యకర్త గుర్తుంచుకోవాల న్నారు. ముఖ్యఅతిథి కేంద్ర వైద్యఆరోగ్య శాఖ మాట్లాడుతూ దీన్ దయాళ్ సమాజంలోని అణగారిన ప్రజలను ఉద్ధరించే దిశగా అనేక కార్యక్రమాలను రూపొందించారన్నారు. రాష్ట్ర సంఘటన్ ప్రధాన కార్యదర్శి మధుకర్, రాష్ట్ర మహిళా మోర్చా అధ్యక్షురాలు బొల్లిన నిర్మలాకిషోర్, ఉంగుటూరు నియోజకవర్గ కన్వీనర్ శరణాల మాలతీరాణి, సర్పంచి రాందే లక్ష్మీసునీత, కృష్ణ ప్రసాద్, పెన్మత్స రామచంద్రరాజు తదితరులు ఆపాల్గొన్నారు.

లేసు పార్కు అభివృద్ధికి సాయం అందిస్తాం



లేసు అల్లికలను పరిశీలిస్తున్న సీఈవో వినోద్‌కుమార్

నరసాపురం రూరల్, జనవరి 5: లేసు పార్కు అభివృద్ధికి సంస్థ తరఫున చేయాల్సిన ఆర్థిక సాయం అందిస్తామని ఏపీ నైపుణ్య అభివృద్ధి సంస్థ ఎండీ, సీఈవో వి.వినోద్‌కుమార్ హామీ ఇచ్చారు. సీతారాంపురం లేసు పార్కును శుక్రవారం ఆయన పరిశీలించారు. పీఎం విశ్వకర్మ ద్వారా జరుగుతున్న శిక్షణ కార్యక్రమంలో ఎంతమంది నేర్చుకుంటున్నారు అనే విషయాలపై ఆరా తీశారు. అనంతరం పలు రిజిస్టర్లు, లేసు అల్లికలను పరిశీలించి అధికారులతో సమీక్షించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ లేసు పార్కులో జరిగే కార్యక్రమాలను యూనివర్స్ యాప్‌లో రిజిస్టర్ చేయాలని అధికారులను ఆదేశించారు. డీఆర్‌డీఏ డీపీఎం శ్రీనివాసులు, డీఎస్‌డీవోఏ కృష్ణారెడ్డి, లేసుపార్కు సీసీ రమేష్ తదితరులు పాల్గొన్నారు.

'డిపాజిట్‌దారులందరికీ న్యాయం చేస్తాం'



డిపాజిట్‌దారులతో మాట్లాడుతున్న డీఆర్ రవికుమార్

టి.నరసాపురం, జనవరి 5 : టి.నరసాపురం సొసైటీలో డిపాజిట్ దారులందరికి రెండు మూడు నెలల్లో న్యాయం చేస్తామని కో-ఆపరేటివ్ డివిజనల్ రిజిస్ట్రార్ ఎం.రవికుమార్ తెలిపారు. స్థానిక సొసైటీ వద్ద శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ డిపాజిట్‌దారులు ఎటువంటి ఆందోళన చెందాల్సిన అవసరం లేదన్నారు. ఇప్పటికే బాధ్యులకు చెందిన ఆస్తులను జప్తు చేశామని, డిక్రీ పొందిన అనంతరం వాటిని వేలం ద్వారా విక్రయించిన నగదుతో పాటు రైతులు రుణాలు పొంది కాలం గడిచినా చెల్లించని నగదు వసూలు చేసి, డిపాజిట్‌దారులకు చెల్లిస్తామన్నారు. దీనికోసం పీఏసీఎస్ సిబ్బందిని రైతులు నుంచి రుణాలు వసూలు చేసేందుకు నియమించామని తెలిపారు. సమావేశంలో డివిజనల్ కో-ఆపరేటివ్ అధికారి మోహన్ బాబు, సొసైటీ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు

మద్యం అమ్ముతున్న వ్యక్తి అరెస్ట్

ఆకివీడు, జనవరి 5: అక్రమ మద్యం అమ్మకాలు జరుపుతున్న వ్యక్తిని అరెస్టు చేశామని ఎస్ఐ బత్తిన నాగబాబు తెలిపారు. స్థానిక సిద్ధాపురం రోడ్‌లో మద్యం అమ్మ తున్న సత్యనారాయణను శుక్రవారం అదుపులోకి తీసుకుని 180 ఎంఎల్ 37 సీసాలు స్వాధీనం చేసుకున్నామన్నారు. ఈమేరకు అతడిని రిమాండ్‌కు భీమవరం తరలించామని ఎస్ఐ తెలిపారు.

జంగారెడ్డిగూడెం పట్టణంలో మార్కెట్ పన్నుల దందా



మాట్లాడుతున్న సీపీఎం నేత జీవరత్నం

జంగారెడ్డిగూడెం టౌన్, జనవరి 5: పట్టణంలో ఆసీల పన్ను దందా నివారించాలని సీపీఎం నాయకులు డిమాండ్ చేశారు. సీపీఎం మండల కమిటీ సమావేశంలో శుక్రవారం ఆయన మాట్లాడుతూ పట్టణంలోని చిరు వ్యాపారులు, తోపుడుబళ్ళు, మోటార్ సైకిల్, ర్యాలీ ఆటోలపై తినుబండారాలు, వస్తువులు అమ్ముకునే పేదల నుంచి రూ.50 నుంచి రూ. వంద వరకు పన్ను వసూలు చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. పట్టణ వ్యాపారులు ఇతర ప్రాంతాల నుంచి లారీలతో సరుకు దిగుమతి చేసుకుంటే లారీకి రూ.100 నుంచి 400 పన్ను విధించటం దుర్మార్గం అన్నారు. గతంలో పలుమార్లు మున్సిపల్ కమిషనర్ దృష్టికి తీసుకెళ్లినా సమస్య పరిష్కారం కాలేదన్నారు. బాధితులను కాంట్రాక్టర్, మున్సిపల్ అధికారులు బెదిరిస్తున్నారని ఆరోపించారు. నిబంధనల ఆశీల పన్ను వసూలు చేయాలని డిమాండ్ చేశారు. సమావేశంలో జి.సూర్య కిరణ్, జోడే సూర్యచంద్రరావు, యాగంటి సీత, గరికి రాంబాబు, పిల్లి చంటి పాల్గొన్నారు.

మాతృభాషా వలంటీర్ల సమస్యలు పరిష్కరించాలి



మాతృభాషా వలంటీర్లతో మాట్లాడుతున్న శ్రీనివాస్

బుట్టాయగూడెం, జనవరి 5: ఐటీడీఏ పరిధిలోని పాఠశాలల్లో పనిచేస్తున్న మాతృభాషా విద్యా వలంటీర్ల సమస్యలను పరిష్కరించాలని మాజీ ఎమ్మెల్యే మొడియం శ్రీనివాస్ డిమాండ్ చేశారు. సమస్యల పరిష్కారం కోరుతూ ఐటీడీఏ వద్ద మాతృభాషా విద్యా వలంటీర్ల సంఘం ఆధ్వర్యంలో వలంటీర్లు రిలే దీక్షలు చేస్తున్నారు. దీక్ష శిబిరాన్ని శుక్రవారం ఆయన సందర్శించి మద్దతు ప్రకటించారు. మూడు నెలల వేతన బకాయిలు, ఉద్యోగ భద్రత కల్పించాలని, ప్రత్యేక శిక్షణ ఇవ్వాలన్నారు. పెరుగుతున్న ధరలకు అనుగుణంగా వేతనాలు పెంచాలన్నారు. గిరిజన సంఘం నాయకుడు తెల్లం రామకృష్ణ మాట్లాడుతూ ఐటీడీఏ అధికారులు మాతృభాషా విద్యా వలంటీర్ల సమస్యలు పరిష్కరించకపోగా బెదిరింపులకు గురిచేయడం బాధాకరమన్నారు. సమస్యల పరిష్కారానికి చొరవ చూపాలన్నారు. సీపీఐ ఎంఎల్ రెడ్‌స్టార్ నాయకులు జొన్నకూటి వెంకటేశ్వరరావు, మడకం రామన్న మద్దతు తెలిపారు. పోలోజు నాగేశ్వరరావు, కుంజా నవీన్, కుసుమ కుమారి, గీతాంజలి, బేబి, సీతామహాలక్ష్మి, కిరణ్‌కుమార్ పాల్గొన్నారు.

భూహక్కు చట్టం రద్దు చేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న లక్ష్మీనారాయణ

ఏలూరు టూటౌన్, జనవరి5: ప్రజల జీవితాలతో ముడిపడి ఉన్న ఏపీ భూమి హక్కుల యాజమాన్య చట్టాన్ని తక్షణం ఉపసంహరించుకోవాలని సామాజిక, రాజకీయ విశ్లేషకుడు లక్ష్మీనారాయణ డిమాండ్ చేశారు. చైతన్యవేదిక ఆధ్వర్యంలో భూమిహక్కు చట్టంపై శుక్రవారం సదస్సు నిర్వహించారు. లక్ష్మీనారాయణ మాట్లాడుతూ చట్టసభల్లో కనీస చర్చ లేకుండానే భూమిహక్కు చట్టాన్ని ఎలా ఆమోదిస్తారని ప్రశ్నించారు. ఈ చట్టంపై ప్రభుత్వం బహిరంగ చర్చకు రావాలని సవాల్ విసిరారు. పారిశ్రామికవేత్తలు, కార్పొరేట్ సంస్థలు, అవినీతి, మాఫియాకు ఈ భూహక్కుల యాజమాన్య చట్టం అనువుగా ఉందన్నారు. తక్షణమే చట్టాన్ని ఉపసంహరించుకోకపోతే ఆందోళన ఉధృతం చేస్తామన్నారు. కార్యక్రమంలో పీఎస్ చందు, శ్రీనివాసడాంగే, పీవీ.శాస్త్రీ, రాజారావు, బీఎస్.రావ్, సత్యనారాయణ, సీపీఐ జిల్లా కార్యదర్శి కృష్ణచైతన్య, బీకేఎంయూ జిల్లా అధ్యక్షుడు బండి వెంకటేశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.

ఓటరు నమోదుపై అవగాహన కార్యక్రమం



గిరిజన నృత్యాలతో అవగాహన ప్రదర్శన

బుట్టాయగూడెం, జనవరి 5: స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో శుక్రవారం తహసీల్దార్ ఎస్.శారాశాంతి ఓటరు అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. 18 సంవత్సరాల వయసు నిండిన ప్రతి ఒక్కరూ ఓటరుగా నమోదు కావడంపై అవగాహన కల్పించారు. గిరిజన సంప్రదాయ నృత్యాలతో కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో కె.రమేష్, కె.గంగరాజు, ప్రియాంక, శామిలి, నాగేశ్వరావు, పోతురాజు విద్యార్థులు పాల్గొన్నారు.

పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలి

ఏలూరు ఎడ్యుకేషన్, జనవరి 5: పరిసరాలతోపాటు వ్యక్తిగత పరిశుభ్రతను కూడాపాటిస్తే అంటువ్యాధుల నుంచి కొంత వరకు రక్షణ లభిస్తుందని లంబాడిపేట అర్బన్ పీహెచ్‌సీ మెడికల్ ఆఫీసర్ ట్వింకిల్ అన్నారు. పీహెచ్‌సీ పరిధిలోని వీధుల్లో దోమల ద్వారా వ్యాప్తిచెందే డెంగీ, మలేరియా, చికున్ గున్యా తదితర వైరల్ సంబంధిత జ్వరాలు, కొవిడ్‌పై శుక్రవారం అవగాహన ర్యాలీ నిర్వహించారు. సీజనల్ వ్యాధుల నుంచి బయటపడేందుకు పాటించాల్సిన ముందస్తు జాగ్రత్తలు తెలియజేశారు. ఇంటి పరిసరాల్లో నీటి నిల్వలు లేకుండా చూసుకోవాలన్నారు. ప్రస్తుతం జరుగుతున్న ఇంటింటా ఫీవర్ సర్వేలో వాస్తవ సమాచారాన్ని ఇవ్వాలని, జ్వర సంబంధిత లక్షణాలుంటే స్థానిక పీహెచ్‌సీలో పరీక్షలు చేయించుకోవాలన్నారు. అసిస్టెంట్ మలేరియా ఆఫీసర్ గోవిందరావు, శ్రీనివాస్, సరళ, పోచమ్మ, సుజన, శాంతిప్రియ, ఆశా కార్యకర్తలు విజయ, సుభాషిణి, సావిత్రి పాల్గొన్నారు.

● లింగపాలెం: కె.గోకవరం పీహెచ్‌సీ పరిధిలోని పుప్పాలవారిగూడెంలో డాక్టర్ కృష్ణకిషోర్ ఆధ్వర్యంలో ఫ్రైడే డ్రైడే కార్యక్రమం నిర్వహించారు. చింతలపూడి సబ్ యూనిట్ ఆఫీసర్ ఎన్.ప్రసాద్ మాట్లాడుతూ ప్రతిఒక్కరూ పరిశుభ్రత పాటించాలన్నారు. అనారోగ్య సమస్యలు ఉంటే వైద్య సిబ్బందిని కలవాలని సూచించారు. ఏఎన్ఎంలు, ఆశాలు, ప్రతి గ్రామంలో ప్రతి ఇంటిని పరీక్షించి ఎవరైనా వ్యాధిగ్రస్తులు ఉంటే వెంటనే వైద్యసహాయం తీసుకునేలా చర్యలు చేపట్టాలని అన్నారు. హెల్త్ అసిస్టెంట్ చంద్రశేఖర్, శ్రీనివాసరావు, శ్రీవల్లీ, హేమలత పాల్గొన్నారు.

అక్రమంగా మద్యం తరలిస్తున్న ఒకరి అరెస్టు

జీలుగుమిల్లి, జనవరి 5 : తెలంగాణ నుంచి అక్రమంగా మద్యం తరలిస్తున్న వ్యక్తిని పోలీసులు అరెస్టు చేశారు. తాటియాకులగూడెం రాష్ట్ర సరిహద్దు చెక్‌పోస్టు వద్ద ఎస్‌హెచ్‌వో కె.నాగేశ్వరావు సిబ్బందితో కలసి వాహనాలు తనిఖీ చేస్తుండగా కాకినాడ జిల్లా రౌతులపూడి మండలం శృంగవృక్షంకు చెందిన అడపా వీరాస్వామి చెక్‌పోస్టు సరిహద్దు ప్రాంతంలో 7మద్యం బాటిళ్లు తీసుకువస్తూ కనిపించాడు. పోలీసులు ఆరా తీయగా నిందితుడు పారిపోయే ప్రయత్నం చేశాడు. అతడిని అదుపులోకి తీసుకుని సంచిలో ఉన్న 7 మద్యం బాటిళ్లు స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్లు ఎస్సై చంద్రశేఖర్ చెప్పారు.

ఉమా మార్కండేయస్వామి ఆలయంలో లక్ష బిల్వార్చన



నిడమర్రు, జనవరి 5: భువ్వనపల్లి ఉమా మార్కేండేయ స్వామి ఆలయంలో శుక్రవారం లక్ష బిల్వార్చన కార్యక్రమం వైభవంగా నిర్వహించారు. స్వామి వారికి ఉదయం ఏకాదశ రుద్రాభిషేకం, నిర్వహించి అనంతరం లక్ష బిల్వార్చన కార్యక్రమం వేదమంత్రోచ్ఛారణతో నిర్వహించారు. అర్చకులు రుద్రపాక శివశ్రీను శర్మ పూజలు నిర్వహించారు. ఈకార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ అలుమోలు అంతర్వేది, సభ్యులు గ్రామస్తులు పాల్గొన్నారు.

బ్రహ్మోత్సవాల్లో లక్ష కుంకుమార్చన

ఏలూరు కార్పొరేషన్, జనవరి 5: రామచంద్రరావుపేట వేంకటేశ్వరస్వామి ఆలయం వద్ద శ్రీవారి త్రిసప్తాహ బ్రహ్మోత్సవాల్లో భాగంగా శుక్రవారం ఆలయ ప్రధాన అర్చకులు కిళాంబి మారుతీ శ్రీనివాస రామానుజాచార్యులు లక్ష కుంకుమార్చన నిర్వహించారు. తొలుత స్వామివారికి, అమ్మవార్లకు పంచామృతాభిషేకం జరిపి అనంతరం విశేష అలంకరణ చేశారు. ఆలయ ఈవో నాగం సన్యాసిరావు, ధర్మకర్తల మండలి చైర్మన్ తోలేటి శ్రీనివాస్ భక్తులకు తగు ఏర్పాట్లు చేశారు.

అంబికాదేవికి కుంకుమార్చన

ఏలూరు కార్పొరేషన్, జనవరి 5: సత్రంపాడు అంబికాదేవి ఆలయంలో శుక్రవారం కుంకుమార్చన అర్చకులు వారణాసి రాఘవేంద్ర శర్మ జరిపించారు. తొలుత అమ్మవారికి అభిషేకం నిర్వహించి విశేష అలంకరణ చేశారు. అంబికా కుటుంబ సభ్యులు అమ్మవారికి ప్రత్యేకపూజలు నిర్వహించారు.

భవాని మాలధారుల ఇరుముడి పూజలు

టినరసాపురం, జనవరి 5 : మండలంలోని బండి వారి గూడెం, బొర్రంపాలెంలో ఇరుముడి పూజలు శుక్రవారం ఘనంగా నిర్వహించారు. బొరంపాలెంలో 50 మంది, బండివారి గూడెంలో సుమారు 60 మంది భవానీలు 45 రోజులుగా దీక్షలు చేశారు. ఉదయం నుంచి ప్రత్యేక పూజలు నిర్వహించి, ఇరుముడితో పురవీధుల్లో ఊరేగి అనంతరం విజయవాడ బయలుదేరి వెళ్లారు. బండివారిగూడెంలో అఖండ అన్న సమారాధనలో అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.



లింగపాలెంలో సమ్మె కొనసాగిస్తున్న అంగన్‌వాడీలు



చింతలపూడిలో అంగన్వాడీల నిరసన



కుక్కునూరులో దున్నపోతుకు వినతిపత్రం



భీమడోలులో అంగన్వాడీల నిరసన

అంగన్వాడీల సమ్మె 25 రోజులు

జిల్లాలో ఉధృతమైన ఆందోళన



నిడమర్రులో అంగన్వాడీల నిరసన ప్రదర్శన

లింగపాలెం, జనవరి 5: అంగన్‌వాడీ వర్కర్ల సమ్మె శుక్రవారం 25వ రోజుకు చేరింది. అంగన్‌వాడీలను ఇబ్బంది పెట్టేందు కు జగన్మోహన్‌రెడ్డి ప్రభుత్వం కుట్రలు చేస్తోందన్నారు. కలెక్టర్, సీడీపీవోల ద్వారా నోటీసులు అందజేసినంత మాత్రాన సమ్మె విరమించేది లేదన్నారు. అంగన్‌వాడీ నేతలు బీజేఎస్ కుమారి, ఈశ్వరి, అంగన్‌వాడీలు పాల్గొన్నారు.

● బుట్టాయగూడెం: డిమాండ్ల సాధనకు పట్టుదలతో అంగన్వాడీలు సమ్మెను కొనసాగిస్తూనే ఉన్నారు. ప్రభుత్వం సానుకూలంగా స్పందించి సమస్యలు పరిష్కరించాలని కోరుతున్నారు. కృపామణి, నూర్జహాన్, రామలక్ష్మి, మున్నీ, శ్రీదేవి, రామయమ్మ, నిర్మల అంగనవాడీలు పాల్గొన్నారు.

● నిడమర్రు: మాట ఇచ్చాడు.. మడమ తిప్పాడు సీఎం జగన్ అంటూ అంగన్వాడీ కార్యకర్తలు నినాదాలు హోరెత్తించారు. నిడమర్రులో అంగన్వాడీ కార్యకర్తలు 25 అంకె రూపంలో కూర్చొని నిరసన తెలియజేశారు. రాష్ట్ర ప్రభుత్వం అధికారులతో బెదిరించి తమ ఉద్యమాన్ని నీరుగార్చే ప్రయత్నం చేస్తుందన్నారు. అనంతరం మానవహారంగా ఏర్పడి నిరసన తెలిపారు. కార్యక్రమం అంగన్వాడీ నాయకులు ఆర్.రామలక్ష్మి, ఎ.నాగమణి, సత్యవేణి, త్రివేణి, సత్యవతి, పార్వతి, సీఐటీయూ నాయకులు నారపల్లి రమణారావు, కోన శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

● చింతలపూడి: అంగన్‌వాడీ కార్యకర్తల సమ్మె 25వ రోజుకు చేరుకుంది. ఫైర్‌స్టేషన్ సెంటర్‌లో నిరసన శిబిరం వద్ద మెప్మా ఆర్పీలు అంగన్‌వాడీ కార్యకర్తలకు సంఘీభావం తెలిపారు. జేఏసీ నాయకురాలు మాణిక్యం మాట్లాడుతూ ప్రభుత్వం కలెక్టర్ ద్వారా బెదిరింపు చర్యలు చేస్తున్నారని, దానికి లొంగేది లేదని స్పష్టం చేశారు. నిరసన శిబిరంలో భారీగా ప్రాజెక్టు పరిధిలోని కార్యకర్తలు పాల్గొన్నారు. జేఏసీ నాయకులు ఎస్.సరోజిని, ఆదిలక్ష్మి, ధనలక్ష్మి, ప్రమీల, మరియమ్మ తదితరులు పాల్గొన్నారు.

● కామవరపుకోట: జగన్ పాదయాత్రలో ఇచ్చిన హామీలను అమలు చేయాలని కోరుతూ అంగన్‌వాడీల సమ్మెలో భాగంగా శుక్రవారం గ్రామంలో నిరసన ప్రదర్శన జరిపారు. మండల పరిషత్ కార్యాలయం వద్ద దీక్షా నిర్వహించారు. పలు గ్రామాలకు చెందిన అంగన్‌వాడీలు పాల్గొన్నారు.

● భీమడోలు : అంగన్‌వాడీలు వలయంగా ఏర్పడి నిరసన వ్యక్తం చేశారు. రాష్ట్ర ప్రభుత్వ మొండి వైఖరిపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రభుత్వం అబద్దాలతో అంగన్‌వాడీలను పక్కదారి పట్టించడానికి అధికారు లతో బెదిరింపులకు దిగుతున్నారన్నారని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు లింగరాజు అన్నారు. మండల నేతలు రాజామణి, స్వర్ణకుమారి, చల్లామణి, రత్నకుమారి, అపర్ణాదేవి తదితరులు పాల్గొన్నారు.

● కుక్కునూరు: అంగన్వాడీలకు ఇచ్చిన హామీలను అమలు చేయండి, లేకుంటే సమ్మె విరమణ లేదని సీఐటీయూ మండల కార్యదర్శి యర్నం సాయికిరణ్ అన్నారు. ప్రభుత్వం సమస్యలు పరిష్కరించకపోవడంతో దున్నపోతుకు వినతిపత్రం ఇచ్చి అంగన్వాడీలు తమ సమస్యలు పరిష్కరించాలని నిరసన వ్యక్తం చేశారు. సమస్యలు పరిష్కరించకుంటే రోడ్లపై భోగి మంటలు వేసి సమస్యలు పరిష్కరించేంత వరకు పోరాడతామన్నారు. సమ్మెలో బాడిస సుజాత, రాయి రమణ, వర్స మంగ, కణితి మంగ, సీఐటీయూ మండల సహాయ కార్యదర్శి పోచారపు వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

● టినరసాపురం: అంగన్వాడీల సమ్మెకు యూటీఎఫ్ మండల అధ్యక్షుడు జి.లక్ష్మణరావు సంఘీభావం తెలిపారు. పాదయాత్రలో జగన్ ఇచ్చిన హామీలను నెరవేర్చాలని డిమాండ్ చేశారు.



జంగారెడ్డిగూడెంలో మున్సిపల్ కార్మికుల నిరసన



చింతలపూడిలో కార్మికుల అర్ధనగ్న ప్రదర్శన



ఏలూరులో న్యాయవాదుల నిరసన



విధులకు వెళ్లకుండా పీపీ వాహనాన్ని అడ్డుకున్న న్యాయవాదులు

సమ్మె.. నిరసన..

సమస్యలు పరిష్కరించాలని మున్సిపల్ కార్మికుల డిమాండ్

ఏలూరు టూటౌన్, జనవరి 5: ఏఐటీయూసీ ఆధ్వర్యంలో మున్సిపల్ కార్మిక సంఘాల జేఏసీ నగరపాలక సంస్థ వద్ద సమ్మె ఉధృతం చేశారు. శుక్రవారం దీక్షలో పాల్గొన్న ఏఐటీయూసీ జిల్లా ఉపాధ్యక్షుడు బండి వెంకటేశ్వరరావు మాట్లాడుతూ సమ్మె పరిష్కారానికి మార్గం చూడకుండా సమ్మె విచ్ఛిన్నానికి ప్రభుత్వం ప్రయత్నించడం దుర్మార్గం అన్నారు. మున్సిపల్ వర్కర్ల సమ్మెకు మద్దతుగా ఆటోవర్కర్స్ యూనియన్, గొర్రెల, మేకల పెంపకందారుల సంఘం మద్దతు తెలిపారు. శనివారం నుంచి సమ్మె మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఏపీ మున్సిపల్ వర్కర్స్ యూనియన్ జిల్లా కార్యదర్శి వామన మూర్తి, కన్నబాబు, తదితరులు పాల్గొన్నారు.

● చింతలపూడి: మునిసిపల్ కార్మికులు, అంగన్‌వాడీల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ పాతబస్టాండ్ నుంచి బోసుబొమ్మ సెంటర్ వరకు మునిసిపల్ వర్కర్లు అర్ధనగ్నంగా ప్రదర్శన నిర్వహించారు. ఏఐటీయూసీ జిల్లా ఉప ప్రధాన కార్యదర్శి తుర్లపాటి బాబు మాట్లాడుతూ గత 24 రోజులుగా అంగన్‌వాడీలు, మూడు రోజులుగా మునిసిపల్ సిబ్బంది సమ్మె చేస్తున్నా ప్రభుత్వం కనీసం స్పందించ లేదని ఆవేదన వ్యక్తం చేశారు. సమాజంలో ధరలు పెరుగుతుంటే కనీసం సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని డిమాండ్ చేశారు. చింతలపూడి నగర పంచాయతీలోని మునిసిపల్ వర్కర్లను ఆప్కాస్‌లో చేర్చాలని కోరారు. అన్ని రాజకీయ పార్టీలను, కార్మిక సంఘాలు, స్వతంత్ర సంస్థలను కలుపుకుని ఉద్యమాన్ని ఉధృతం చేస్తామని హెచ్చరించారు. సమ్మె శిబిరానికి టీడీపీ, జనసేన, సీపీఐ నాయకులు సంఘీభావం తెలిపారు. మారుమూడి థామస్, కంచర్ల గురవయ్య, డి.రంగనాథ్, భారతి, పక్కాల వెంకటేశ్వరరావు, బోడా నాగభూషణం, అనీష్‌కుమార్, రాజారత్నం, తదితరులు తమ సంఘీభావం తెలిపారు. యూనియన్ నాయకులు మరియమ్మ, అనురాధ తదితరులు ప్రసంగించారు.

● జంగారెడ్డిగూడెం టౌన్: మున్సిపల్ కార్మికుల న్యాయమైన డిమాండ్లు పరిష్కరించాలని ఏఐటీయూసి ఏలూరు జిల్లా గౌరవ అధ్యక్షుడు కె.కృష్ణమాచార్యులు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మున్సిపల్ కార్మికులు అర్ధనగ్న ప్రదర్శనతో నిరసన తెలిపారు. దీక్షా శిబిరాన్ని ఏఐటీయూసి జిల్లా గౌరవ అధ్యక్షుడు కె.కృష్ణమాచార్యులు, సీపీఐ జిల్లా కార్యదర్శి మన్నవ కృష్ణ చైతన్య కంకిపాటి బుచ్చిబాబు సందర్శించి సంఘీభావం తెలిపారు. కార్మికుల సమస్యల పరిష్కారం వైపుగా ప్రభుత్వం కృషి చేయాలని కోరారు. ఏపీ మున్సిపల్ వర్కర్స్ యూనియన్ పట్టణ గౌరవ అధ్యక్షుడు జెవి రమణరాజు, గొలిమే బాలఏసు, కె.విఘ్నేష్, కె.నాగేశ్వరరావు, బొక్కా శ్రీను, రేలంగి నాగరాజు, ఉందుర్తి నాగరాజు, పొడుదోలు రమణ తదితరులు పాల్గొన్నారు.

ఎస్ఎస్ఏ ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలి

ఏలూరు ఎడ్యుకేషన్: తమ సర్వీసులను క్రమబద్ధీకరించాలని, ఉద్యోగ భద్రత కల్పించాలని, హెచ్ఆర్ పాలసీని అమలుచేయాలని డిమాండ్ చేస్తూ సమగ్రశిక్ష అవుట్ సోర్సింగ్, పార్ట్‌టైం ఉద్యోగులు చేపట్టిన సమ్మెకు ప్రభుత్వం పరిష్కారచర్యలు తీసుకోవాలని పీఆర్టీయూ జిల్లా అధ్యక్షుడు పి.ఆంజనేయులు కోరారు. 17రోజులుగా చేస్తున్న సమ్మెలో భాగంగా శుక్రవారం విజయవాడలో ఎస్ఎస్ఏ ఎస్పీడీ కార్యాలయాన్ని ముట్టడించడానికి వెళ్ళిన ఉద్యోగులను పోలీసులు అరెస్టుచేయడాన్ని ఖండించారు.

న్యాయవాదుల రిలే దీక్ష

ఏలూరు క్రైం: భూ హక్కు చట్టాన్ని రద్దు చేయాలని న్యాయవాదులు చేపట్టిన రిలే నిరాహార దీక్ష శుక్రవారం కొనసాగింది. మహిళా న్యాయవాదులు దీక్షలో పాల్గొన్నారు. తెలుగుదేశం నాయకులు అశోక్‌గౌడ్ దీక్షా శిబిరానికి వెళ్లి మద్దతు ప్రకటించారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన భూ హక్కు చట్టం రద్దు చేసే వరకు ఉద్యమాన్ని కొనసాగిస్తామని న్యాయవాదులు ప్రకటించారు. మరోవైపు న్యాయవాదులు కోర్టు విధులను బహిష్కరించారు. విధులకు వెళుతున్న పలువురు న్యాయవాదులను, పీపీ వాహనాన్ని దీక్ష చేపట్టిన న్యాయవాదులు అడ్డగించారు.

ద్వైవార్షిక నిధులు రూ.3.38 కోట్లు

ఏలూరు రూరల్, జనవరి 5 : జిల్లాలో ద్వై వార్షిక నిధులు 2,168 మంది లబ్ధిదారులకు రూ.3.38 కోట్లు ప్రభుత్వం విడుదల చేసినట్టు కలెక్టర్ ప్రసన్న వెంకటేశ్ చెప్పారు. వివిధ సంక్షేమ పథకాల్లో లబ్ధి అందని అర్హులకు శుక్రవారం సీఎం క్యాంప్ కార్యాలయంలో శుక్రవారం సీఎం జగన్ బటన్ నొక్కి లబ్ధిదారుల ఖాతాల్లో జమ చేశారు. కలెక్టరేట్ నుంచి వీడియో కాన్ఫరెన్స్‌లో కలెక్టర్, ఎమ్మెల్సీ జయమంగళ వెంకటరమణ, డీఆర్డీ ఏపీడీ ఆర్.విజయరాజు, సంబంధిత అధికారులు, లబ్ధిదారులు పాల్గొన్నారు. ఈ మేరకు నమూనా చెక్కును కలెక్టర్, ఎమ్మెల్సీ లబ్ధిదారులకు అందజేశారు. కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో బీసీ కార్పొరేషన్ పరిధిలో వైఎస్ఆర్, ఈబీసీ నేస్తం కింద 143 మందికి రూ.21.45 లక్షలు, వైఎస్సార్ కాపునేస్తం 102 మందికి రూ.15.30 లక్షలు, జగనన్న చేదోడు 486 మందికి రూ.48.60 లక్షలు, రవాణా శాఖ ద్వారా వైఎస్సార్ వాహనమిత్ర 77మందికి రూ.7.70 లక్షలు, మత్స్యశాఖ పరిధిలో మత్స్యకార భరోసా పథకంలో ఒక్కరికి రూ.10 వేలు, అమ్మఒడి 1276 మందికి రూ.1.79 కోట్లు, వైఎస్సార్ కళ్యాణ మస్తు, షాదీ తోఫా 83 జంటలకు రూ.65.55 లక్షలు లబ్ధిదారుల ఖాతాల్లో జమ చేశారు.

ఉపాధి పనులపై కలెక్టర్ సమీక్ష

జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం ద్వారా రాబోయే ఆర్థిక సంవత్సరంలో చేపట్టాల్సిన శాశ్వత అభివృద్ధి పనులపై ప్రతిపాదనలు ఈనెల 12వ తేదీలోగా సమర్పించాలని కలెక్టర్ ప్రసన్న వెంకటేశ్ అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్‌లో శుక్రవారం ఉపాధి హామీ పథకంలో ఈ ఏడాది చేపట్టిన పనులు, రానున్న సంవత్సరంలో చేపట్టాల్సిన కార్యక్రమాలపై అధికారులతో సమీక్షించారు. అటవీశాఖ అధికారి రవీంద్ర దామా, సామాజిక వనవిభాగం అధికారి హిమశైలజ, డ్వామా పీడీ విజయ్‌రాజు పాల్గొన్నారు.

దత్తత చిన్నారులను ఉన్నతంగా తీర్చిదిద్దండి

పిల్లలను దత్తత తీసుకున్న వారు ఉన్నతంగా తీర్చిదిద్దాలని కలెక్టర్ ప్రసన్న వెంకటేశ్ సూచించారు. కలెక్టరేట్‌లో శుక్రవారం ఇద్దరు చిన్నారులను రెండు కుటుంబాలకు దత్తత ఇచ్చారు. కలెక్టర్ మాట్లాడుతూ దత్తత చిన్నారుల ఆప్యాయంగా చూసుకోవాలని, వారి బాగోగులను ఎప్పటికప్పుడు అధికారులకు తెలియజేయాలన్నారు. దత్తత ధ్రువపత్రాలను అందజేశారు. కార్యక్రమంలో డీసీపీవో సీహెచ్.సూర్య చక్రవేణి, బాలల రక్షణ అధికారి ఆర్.రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

9న జిల్లా సమగ్రాభివృద్ధి సదస్సు

ఏలూరు టూటౌన్, జనవరి 5: సీపీఎం ఆధ్వర్యంలో ఈ నెల 9వ తేదీన జిల్లా సమాగ్రాభివృద్ధి సదస్సు జరుగుతుందని జిల్లా కార్యదర్శి రవి చెప్పారు. సీపీఎం జిల్లా కార్యాలయంలో సదస్సు కరపత్రాలు ఆవిష్కరించారు. జిల్లా సమాగ్రాభివృద్ధి సదస్సుకు సీపీఎం రాష్ట్ర కార్యదర్శి శ్రీనివాసరావు, ఎమ్మెల్సీలు లక్ష్మణరావు, ఐ.వెంకటేశ్వరరావు, హాజరవుతారన్నారు.

కోడిపందేలు, జూదానికి దూరంగా ఉండాలి

భీమడోలు, జనవరి 5: కోడిపందేలు, జూదం వంటి వ్యసనాలకు యువత దూరంగా ఉండాలని ఎస్ఐ చావా సురేష్ సూచించారు. భీమడోలు తహసీల్దార్ కార్యాలయంలో కోడిపందేలు, పేకాట నివారణపై వీఆర్వోలు, రెవెన్యూ అధికారులతో శుక్రవారం సమావేశం నిర్వహించారు. ఎస్ఐ మాట్లాడుతూ ఇటువంటి అసాంఘిక కార్యక్రమాలకు పాల్పడేవారిపై చర్యలు తీసుకుంటామని చెప్పారు. ఎక్కడైనా కోడిపందేలు, పేకాట, జూదం నిర్వహిస్తే సమాచారం ఇవ్వాలన్నారు. తహసీల్దార్ ఇందిరాగాంధీ, సిబ్బంది పాల్గొన్నారు.

ద్విచక్ర వాహనదారులు హెల్మెట్ ధరించాలి

ద్విచక్ర వాహనదారులందరూ తప్పనిసరిగా హెల్మెట్ ధరించి ప్రమాదాల నుంచి రక్షించుకోవాలని ఎస్ఐ చావా సురేష్ సూచించారు. భీమడోలు, పరిసర ప్రాంతాల్లో హెల్మెట్ లేకుండా వాహనాలు నడుపుతున్న పలువురికి ఆయన అవగాహన కల్పించారు. ప్రమాదాల్లో గాయపడుతున్న 60 శాతం మంది హెల్మెట్ లేక పోవడంతో మృత్యువాత పడుతున్నారన్నారు. హెల్మెట్ లేకుండా నిర్లక్ష్యంగా దానిని ధరించకుండా వాహనం నడపడం నేరమని అటు వంటి వారిపై చర్యలు తీసుకుంటామన్నారు.

వాహన చట్టాలపై అవగాహన ర్యాలీ

చింతలపూడి, జనవరి 5: పోలీసుశాఖ ఆధ్వర్యంలో వాహన చట్టాలపై శుక్రవారం అవగాహన సదస్సు నిర్వహించారు. సీఐ ఎంవీఎస్ మల్లేశ్వరరావు మాట్లాడుతూ డ్రైవర్లు, వాహనాలు నడిపే ప్రతీ ఒక్కరు వాహన చట్టాలపై అవగాహన పెంచుకుని నడుచుకోవాలని, విధిగా లైసెన్సులు పొంది ఉండాలని పలు విషయాలపై అవగాహన కల్పించారు. పట్టణంలో ఆటోలతో ర్యాలీ నిర్వహించారు. లయన్స్ క్లబ్, సాయి స్ఫూర్తి నిర్వాహకులు పాల్గొన్నారు.

గంజాయి, మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలి

ఉంగుటూరు, జనవరి 5: యువత వ్యసనాలకు బానిస కాకుండా గొప్ప పౌరులుగా మారాలని చేబ్రోలు ఏఎస్ఐ కె.సాంబశివరావు అన్నారు. నారాయణపురం శ్రీఅరవింద శత జయంతి ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో శుక్రవారం భారత్ అభియాన్ కార్యక్రమంలో భాగంగా నాసా ముక్త భారత్ అభియాన్ నిర్వహించారు. కార్యక్రమంలో గంజాయి తదితర మత్తు పదార్థాలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. కొండా రవి మాట్లాడుతూ ఈ ప్రాంతంలో కూడా గంజాయి కేసులు నమోదు కావడం బాధాకరమన్నారు. ఎన్ఎస్ఎస్ ప్రోగ్రామ్ కోఆర్డినేటర్ నిర్మల జ్యోతి, కృష్ణ జ్యోతి విద్యార్థులు పాల్గొన్నారు.

విద్యార్థులకు సైకిళ్ల పంపిణీ

భీమడోలు, జనవరి 5: పలువురు విద్యార్థులకు సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు ఆర్.లింగరాజు సైకిళ్ల పంపిణీ చేశారు. ఆయన బంధువు హరి కొండ లెనిన్‌బాబు ఎన్ఆర్ఐ ఆర్థిక సహాయంతో సైకిళ్లను ఐదుగురు విద్యార్థినులకు అందజేశారు. శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.



కేక్ కట్ చేస్తున్న మాజీ ఎమ్మెల్యే ఘంటా మురళీ రామకృష్ణ

ఘనంగా ఘంటా మురళి జన్మదిన వేడుకలు

కామవరపుకోట, జనవరి 5: చింతలపూడి మాజీ ఎమ్మెల్యే ఘంటామురళీ రామకృష్ణ జన్మదినోత్సవం సందర్భంగా శుక్రవారం ఆయన స్వగ్రామమైన పాతూరులో ఘనంగా నిర్వహించారు. మాజీ ఎంపీ మాగంటి బాబు ఆయనతో కేక్ కట్ చేయించారు. టీడీపీ జిల్లా అధ్యక్షుడు గన్ని వీరాంజనేయులు, టీడీపీ నాయకులు గోరుముచ్చు గోపాల్ యాదవ్, సొంగా రోషన్‌కుమార్, ఆకుమర్తి రామారావు, బొమ్మాజీ అనిల్, కిలారు సత్యనారాయణ, చింతమనేని ప్రభాకర్ పాల్గొన్నారు. టీడీపీ జిల్లా ఉపాధ్యక్షుడు తూతా లక్ష్మణరావు, మేరుగు సుందరరావు, బొంతు చిన వెంకటేశ్వరరావు, టీడీపీ నాయకులు మొట్టికాయల నాగేశ్వరరావు, తూతా రమేష్, మట్టే వెంకటేశ్వరరావు, తూతా సురేష్, ఏనుగ సత్యనారాయణ, నల్లూరి భూషణం,నందిగంశ్రీనివాసరావు, కోలా విశ్వేశ్వరరావు, కొండపల్లి నాగు తదితరులు పాల్గొన్నారు.

యువతకు క్రీడా సామగ్రి పంపిణీ

బుట్టాయగూడెం, జనవరి 5: గ్రామీణ యువత క్రీడారంగంలో ప్రోత్సహించే ఉద్దేశంతో తపన ఫౌండేషన్ ద్వారా క్రీడా సామగ్రి అందజేస్తున్నారు. జైనవారిగూడెం, వాడపల్లి కాలనీ, మంచులవారిగూడెం, బుద్ధులవారిగూడెం, కుమ్మరికుంట, గుళ్ళపూడి, అలివేరు గ్రామాల్లో 100 క్రికెట్ కిట్లు, 200 వాలీబాల్ కిట్లను ఫౌండేషన్ వ్యవస్థాపకుడు సీతారామాంజనేయ చౌదరి ఆధ్వర్యంలో అందజేశామన్నారు. కార్యక్రమంలో పి.మోహనరావు, వెంకటేశ్వరరావు, క్రీడాకారులు, తదితరులు పాల్గొన్నారు.

సంక్షిప్త సమాచారం..

- **ఏలూరు రూరల్ :** స్థానిక 26,35,44,45 డివిజన్‌లో శుక్రవారం 1.29కోట్లతో చేపట్టిన అభివృద్ధి పనులకు ఎమ్మెల్యే ఆళ్లనాని శంకుస్థాపన చేశారు. రోడ్లు, డ్రైన్‌లు నిర్మాణం పై ప్రత్యేక దృష్టిసారించినట్లు తెలిపారు. మేయర్ షేక్ నూర్జహాన్, ఈడా చైర్మన్ బొద్దాని శ్రీనివాస్ పాల్గొన్నారు.
- **ఏలూరు కార్పొరేషన్ :** దొండపాడు దత్తాత్రయం రోడ్డులో గత నెల 15 నుంచి మకర జ్యోతి దర్శనానికి వెళ్ళే అయ్యప్పస్వాములకు, సర్వ మాలాధారణ భక్తులకు మధు నంబూద్రి గురుస్వామి ఆశీస్సులతో రేపూరి భాస్కర్ గురుస్వామి నిర్వహిస్తున్న నిత్య భిక్ష కార్యక్రమం శుక్రవారం ముగిసింది. ముగింపు సందర్భంగా అయ్యప్పస్వామి వారికి శబరిమలలో జరిగే పూజా విధానం, కలశ పూజ, పడిపూజ నిర్వహించారు.
- **దెందులూరు :** ప్రతి కుటుంబానికి జగనన్న ఆరోగ్య సురక్ష ద్వారా వైద్య సేవలను అందించడం జరుగుతుందని పెరుగుగూడెం సర్పంచ్ యలమర్తి రేవతి రామకృష్ణ, అన్నారు. మండల ప్రత్యేకాధికారి కృపవరం, తహసీల్దార్ వి నాంచారయ్య, ఎంపీడీవో భీమరాజుతో కలిసి జగనన్న ఆరోగ్య సురక్ష క్యాంప్ నిర్వహించారు.
- **పెదపాడు :** అర్హులందరికీ ఆరోగ్యశ్రీ కార్డులను అందజేస్తామని ఎంపీడీవో సబ్బితి నరసింహామూర్తి తెలిపారు. పెదపాడు ఇందిరాకాలనీలో లబ్ధిదారులకు ఆరోగ్యశ్రీ కార్డుల పంపిణీ కార్యక్రమాన్ని నరసింహమూర్తి పరిశీలించారు. ఆరోగ్యశ్రీ, దిశా యాప్‌లను లబ్ధిదారుని మొబైల్ ఫోనులో డౌన్‌లోడ్ చేయాలని సిబ్బందిని ఆదేశించారు.
- అందరికీ నాణ్యమైన వైద్యం అందుబాటులోకి తీసుకువచ్చేందుకు ఆరోగ్య సురక్ష కార్యక్రమాలను నిర్వహిస్తున్నట్లు చక్రాయిగూడెం సర్పంచ్ సింహాద్రి బేబి అన్నారు. కె.కన్నాపురంలో జగనన్న ఆరోగ్య సురక్ష - 2 కార్యక్రమాన్ని శుక్రవారం నిర్వహించారు. ఈర్పుగంటి రమేష్, బొల్లు లక్ష్మణరావు, మారగాని సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.
- **ఉంగుటూరు :** దివంగత ఎమ్మెల్సీ దివంగత సాబ్జి జయంతిని యూటీఎఫ్ మండల శాఖ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. మండల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఉనముల రాంబాబు, డాకి జోగినాయుడు, మండలంలోని ప్రధానోపాధ్యాయులకు హేండ్ బుక్‌లు అందించారు.
- ఉంగుటూరు మండలం నారాయణపురం కోదండరామాలయం వద్ద గీతామృత వాహిని సత్సంగ్, సీతారామ గీతార్చన భజన మండలి ఆధ్వర్యంలో వేంకటేశ్వర గానామృతం నిర్వహించారు.



జయహో బీసీ కార్యక్రమంలో మాట్లాడుతున్న చింతమనేని ప్రభాకర్



ప్రజల సమస్యలు తెలుసుకుంటున్న బడేటి చంటి

బీసీ సాధికారతే టీడీపీ లక్ష్యం

చింతమనేని

పెదవేగి, జనవరి 5 : బీసీ సాధికారితే లక్ష్యంగా తెలుగుదేశం పార్టీ కృషి చేస్తుందని దెందులూరు మాజీ ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్ అన్నారు. అంకన్నగూడెంలో జయహో బీసీ కార్యక్రమాన్ని శుక్రవారం ఆయన ప్రారంభించారు. వైసీపీ పాలనలో ఎస్సీ, ఎస్టీలతో పాటు బీసీలు కూడా అన్ని విధాలుగా అన్యాయానికి గురయ్యారన్నారు. బీసీలు రాజకీయంగా, ఆర్థికంగా, సామాజికంగా అభివృద్ధి చెందారంటే అది టీడీపీ పాలనలో చంద్రబాబు సారధ్యంలోనే సాధ్యపడిందని తెలిపారు. బీసీలు తెలుగుదేశం పార్టీ అనుబంధ వర్గీయులని, అదే టీడీపీ విజయానికి దోహదపడుతుందన్నారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు యిప్పిలి వెంకటేశ్వరరావు, బొప్పన సుధాకర్, తాతా సత్యనారాయణ, మాదు కుమార్, మోరు శ్రావణి, గారపాటి రామసీత, ముమ్మిడి సక్కుకుమారి, తలకొండ జమలయ్య, నంబూరి నాగరాజు, నేతల రవి, మామిళ్ళలపల్లి సురేష్‌బాబు, దేవరపల్లి ఆదాం, రాజేష్, జనసేన నాయకురాలు ఘంటసాల వెంకటలక్ష్మి, గోరుముచ్చు గోపాల్‌యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

టీడీపీ, జనసేన కూటమిని బలపరచండి

ఏలూరు టూటౌన్: ప్రజా వ్యతిరేక విధానాలు అనుసరిస్తున్న వైసీపీ ప్రభుత్వాన్ని ఇంటికి పంపేందుకు టీడీపీ, జనసేన కూటమిని బలపరచాలని టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి బడేటి చంటి అన్నారు. 13వ డివిజన్‌లో ప్రజా సంకల్పయాత్ర నిర్వహించారు. నాలుగున్నరేళ్లలో వైసీపీ ప్రభుత్వం వివిధ పన్నులతో ప్రజలను దోచుకుతిందన్నారు. జగన్‌ను చూసి వైసీపీ నాయకులే బయపడుతున్నారన్నారు. మరలా వైసీపీ గెలిచే పరిస్థితి లేదని ఆ పార్టీ నాయకులు వేరే పార్టీల వైపు చూస్తున్నారని అన్నారు. చంద్రబాబు, పవన్ కలయికతో వైసీపీ డిపాజిట్లు కోల్పోతుందన్నారు. ఈ కార్యక్రమంలో పీ.వెంకట్రావు, ఎం.శ్రీనివాసరావు, రామలక్ష్మి, తోట రవి, నాగరాజు,రాజేష్, తదితరులు పాల్గొన్నారు.

కొనసాగుతున్న న్యాయవాదుల దీక్షలు

నూజివీడు టౌన్, జనవరి 5: ఏపీ ల్యాండ్ టైటిల్ యాక్ట్-2022 ను రద్దుచేయాలని కోరుతూ న్యాయవాదులు చేపట్టిన రిలేనిరాహారదీక్షలు యదావిధిగా కొనసాగుతున్నాయి. ఈ సందర్భంగా శుక్రవారం రిలేదీక్షల్లో న్యాయవాదులు మల్లవల్లి రమేష్, చింతాతేజ్‌చంద్, దొండపాటి సురేష్, న్యాయవాద గుమస్తాలు మహ్మద్ఆరీఫ్, జూలూరి సాయి తదితరులు పాల్గొన్నారు.

మహిళకు కొవిడ్ పాజిటివ్

ఏలూరు ఎడ్యుకేషన్, జనవరి 5 :ఏలూరు నగర పరిధిలో ఓ మహిళ (50)కు శుక్రవారం కొవిడ్ పాజిటివ్ నిర్ధారణ అయింది. ప్రస్తుతం ఆమె హోం ఐసొలేషన్‌లో ఉన్నారని, ఆరోగ్యం స్థిరంగా ఉందని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ వర్గాలు వెల్లడించాయి. ఇటీవల కొవిడ్ జేఎన్-1 వేరియంట్ నిర్ధారణ అయిన ఓ ప్రైవేటు ఆస్పత్రి వైద్యుడు పూర్తిగా కోలుకున్నారని వైద్యవర్గాలు తెలిపాయి. తాజాగా వెలుగులోకి వచ్చిన కేసుతో కలుపుకుని జిల్లాలో ప్రస్తుతం ఐదు యాక్టివ్ కేసులున్నాయి.

సున్నిత పర్యావరణ ప్రాంత నిర్ధారణపై సమీక్ష



ఏలూరు కలెక్టరేట్, జనవరి 5: కొల్లేరు ఐదో కాంటూరు చుట్టూ సున్నిత పర్యావరణ ప్రాంత పరిధిలోకి వచ్చే తొమ్మిది మండలాల్లోని 89 గ్రామాలపై మండల కేంద్రాల్లో నిర్వహించిన గ్రామసభల్లో సేకరించిన ప్రజాభిప్రాయాలు, ప్రజాప్రతినిధుల అభిప్రాయాలపై శుక్రవారం కలెక్టరేట్‌లో సమీక్షా నిర్వహించారు. కలెక్టర్ ప్రసన్న వెంకటేష్ మాట్లాడుతూ కొల్లేరు సున్నిత పర్యావరణ ప్రాంత నిర్ధారణకు చేపట్టే చర్యలపై సభ్యులకు వివరించారు. దీనికి సంబంధించి మౌలిక విషయాలను పరిధి ప్రతిపాదనలు సభ్యులకు తెలిపారు. ఎమ్మెల్సీ జయమంగళ వెంకటరమణ మాట్లాడుతూ కొల్లేరు సున్నిత పర్యావరణ ప్రాంతాన్ని గతంలో ఐదో కాంటూరు నుంచి ఒక కిలోమీటర్ పరిధిని ప్రతిపాదించారని సమావేశం దృష్టికి తీసుకొచ్చారు. అయితే ఈ ప్రతిపాదనలు ఎంతవరకు సఫలీకృతం అవుతాయోనని అధికారులు అనుమానం వ్యక్తం చేశారు. కైకలూరు ఎమ్మెల్యే దూలం నాగేశ్వరరావు, కమిటీ సభ్యులు, అటవీ, వన్యప్రాణుల విభాగం అధికారులు పాల్గొన్నారు.



అ'పూర్వ' సమ్మేళనం

నూజివీడు, జనవరి 5: నూజివీడు లయన్ బండి శోభనాచలం ప్రభుత్వ ఐటీఐ మొదటిబ్యాచ్ విద్యార్థుల ఆత్మీయ సమావేశం శుక్రవారం జరిగింది. ఇక్కడ శిక్షణ పొంది పలు ప్రాంతాల్లో ఉద్యోగాలు సాధించి స్థిరపడిన నాటి విద్యార్థులు 45 ఏళ్ల తరువాత నూజివీడు మండలం సుంకొల్లు గ్రామంలోని మాజీ ఎమ్మెల్యే చిన్నం రామకోటయ్య విశ్రాంతి భవన ప్రాంగణంలో ఆత్మీయ సమావేశం నిర్వహించారు. ముఖ్య అతిథిగా ఐటీఐ వ్యవస్థాపకుడు బండి శోభనాచలం కుమారుడు బండి పాండురంగారావు పాల్గొన్నారు. పూర్వ విద్యార్థులను మాజీ ఎమ్మెల్యే చిన్నం రామకోటయ్య అభినందించారు. నూజివీడు మున్సిపల్ కోఆప్షన్ సభ్యుడు రామిశెట్టి మురళీకృష్ణకుమార్ మాట్లాడుతూ నూజివీడులో విద్యాదాతలైన ఎమ్మార్ అప్పారావు వంశస్థులకు, బండి శోభనాచలానికి తాము రుణపడి ఉన్నామన్నారు. పూర్వ విద్యార్థులు గత స్మృతులను నెమరు వేసుకున్నారు. ప్రభాతకుమార్, వక్కలగడ్డ విజయ్‌కుమార్, చక్రధర్‌రావు తదితరులు పాల్గొన్నారు.

నాదెండ్లకు మరీదు వినతిపత్రం

నూజివీడు, జనవరి 5: నూజివీడు ఎమ్మెల్యే సీటు జనసేనకు ఇచ్చి పోటీకి అవకాశం కల్పించాలని ఉమ్మడి కృష్ణాజిల్లా అధికార ప్రతినిధి, నూజివీడు నియోజకవర్గ జనసేన నాయకుడు మరీదు శివరామకృష్ణ నాదెండ్లను కోరారు. శుక్రవారం జనసేన పీఏసీ చైర్మన్ నాదెండ్ల మనోహర్, ఉమ్మడి కృష్ణాజిల్లా అధ్యక్షుడు బి. రామకృష్ణను జనసేన నాయకులు కలిశారు. దీనిపై నాదెండ్ల స్పందిస్తూ విషయాన్ని అధినేత పవన్‌కల్యాణ్ దృష్టికి తీసుకువెళ్తానన్నారు. జనసేన నూజివీడు మండల అధ్యక్షులు రాము, కార్యదర్శి షేక్ నాగూర్, విజయవాడ రూరల్ మండల అధ్యక్షుడు పొదిలి దుర్గారావు, నూజివీడు పట్టణ నాయకులు బండారు రాజు, సునీల్‌కుమార్, వీర మహిళలు పాల్గొన్నారు.

నేడు హుండీల లెక్కింపు

ముదినేపల్లి రూరల్, జనవరి 5: శింగరాయపాలెం -చేవూరుపాలెం సెంటర్‌లోని వల్లీదేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వర స్వామి దేవస్థానంలో శనివారం ఉదయం 9.30 గంటలకు స్వామివారి హుండీల ఆదాయం లెక్కిస్తున్నట్టు ఆలయ సహాయ కమిషనర్, కార్యనిర్వహణ అధికారిణి నేల సంధ్య తెలిపారు. గ్రామస్థులు పాల్గొనవలసిందిగా కోరారు.

నేడు భవనాల ప్రారంభం, పెన్షన్ల పంపిణీ

ముసునూరు, జనవరి 5: ముసునూరు జడ్పీ పాఠశాలలో నూతనంగా నిర్మించిన అదనపు తరగతుల భవనం, ఆర్బీకే భవనాన్ని శనివారం ఉదయం 10 గంటలకు నూజివీడు ఎమ్మెల్యే ప్రతాప్ అప్పారావు ప్రారంభిస్తారని ఎంపీడీవో జి.రాణి తెలిపారు. అనంతరం నూతన పెన్షన్‌ల పంపిణీ జరుగుతుందని లబ్ధిదారులంతా హాజరు కావాలని ఆమె కోరారు.



ఏఎంసీ చైర్మన్‌గా వీర్రాజు

కైకలూరు, జనవరి 5: వ్యవసాయ మార్కెట్ కమిటీల ద్వారా రైతులకు, ప్రభుత్వానికి అనుసంధానంగా చైర్మన్ పనిచేసి మంచి గుర్తింపు తీసుకు రావాలని శాసనమండలి చైర్మన్ కొయ్యే మోషన్ రాజు అన్నారు. శుక్రవారం కైకలూరు వ్యవసాయ మార్కెట్ నూతన కమిటీ ప్రమాణ స్వీకారోత్సవంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. చైర్మన్‌గా చేబోయిన వీర్రాజు, వైస్ చైర్మన్‌గా ఉచ్చుల చిన్నరాజు, కమిటీ సభ్యులు ప్రమాణస్వీకారం చేశారు. ఎమ్మెల్యే దూలం నాగేశ్వరరావు, పెనమలూరు ఎమ్మెల్యే కొలుసు పార్థసారథి, ఎమ్మెల్సీ జయమంగళ వెంకటరమణ, నాలుగు మండలాల ఎంపీపీలు, జడ్పీటీసీ సభ్యులు పాల్గొన్నారు.

అయోధ్య రాముడి అక్షింతల పంపిణీ

ముసునూరు, జనవరి 5: అన్నవనేనివారిగూడెంలో అయోధ్య నుంచి వచ్చిన అక్షింతలను సర్పంచ్ పుట్ల మోహన్‌రావు, ఉప సర్పంచ్ పి. శ్రీనివాసరావు ఆధ్వర్యంలో శుక్రవారం ఊరేగించారు. అనంతరం ప్రతి ఇంటికి వాటిని అందజేశారు. అయోధ్యలో నిర్మించిన రామమందిరంలో శ్రీరాముడి విగ్రహ ప్రతిష్ఠ మహోత్సవాల్లో ప్రజలంతా భాగస్వాములు కావాలని కోరారు. మహిళలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

క్రైం కార్నర్

మొక్కజొన్న పంట ధ్వంసంపై ఫిర్యాదు

ముసునూరు, జనవరి 5: మొక్కజొన్న పంటకు గడ్డిమందు కొట్టి ధ్వంసం చేసిన ముగ్గురు నిందితులపై ముసునూరు పోలీసులు గురువారం రాత్రి కేసు నమోదు చేశారు. ఎస్ఐ ఎం.కుటుంబరావు తెలిపిన వివరాల ప్రకారం ముసునూరు ఎస్సీ కాలనీకి చెందిన రైతులు మద్దాల మునిలి, చీలి జోజప్పకు చెందిన 1.24 ఎకరాల భూమిలో సీడ్ మొక్కజొన్న పంటను సాగు చేశారని, గత నెల 14వ తేదీ రాత్రి వీరి పంటపై గండిపూడి జార్జి, అతని కూమారులు రవి, బాబురావు గడ్డిమందు కొట్టారని, దోషులపై చర్యలు తీసుకుని, పంటకు పరిహారం ఇప్పించాలన్న బాధిత రైతుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్టు ఎస్ఐ తెలిపారు.

అక్రమ మద్యం విక్రయదారుడిపై కేసు నమోదు

ముసునూరు, జనవరి 5: ముసునూరు రజకులపేటలో కంచర్ల ఏసుబాబు అనే వ్యక్తి అక్రమంగా మద్యం అమ్ముతుండగా దాడి చేసి పట్టుకున్నట్టు హెడ్ కానిస్టేబుల్ కె.శివనాగేంద్రరావు తెలిపారు. ఐదు మద్యం సీసాలను స్వాధీనం చేసుకుని, నిందితుడిని అదుపులోకి తీసుకుని కేసు నమోదు చేశామన్నారు.

ఎక్కడి చెత్త అక్కడే..

- మునిసిపల్ కార్మికుల సమ్మెతో అధ్వానంగా పారిశుధ్యం
- అనారోగ్యం బారినపడతామంటున్న ప్రజలు
- తక్షణం చర్యలు తీసుకోవాలని వినతి



బస్టాండ్‌రోడ్డులో రహదారిపై ఉన్న చెత్త..



బ్యాంకు స్ట్రీట్‌లో పోస్టాఫీస్ పక్కనే పేరుకుపోయిన చెత్త

(నూజివీడు టౌన్)

నూజివీడు చెత్తమయమైంది. ఏ రోడ్డుచూసినా చెత్తాచెదారంతో దర్శనమిస్తోంది. మున్సిపల్ కాంట్రాక్ట్, అవుట్ సోర్సింగ్ పారిశుధ్య కార్మికులు సమ్మె బాట పట్టడంతో మురుగు నిలిచిపోయింది. ఎక్కడి చెత్త అక్కడే తిష్టవేసింది. రహదారుల పక్కన డస్ట్‌బిన్‌లలో చెత్త పేరుకుపోయి అటుగా వెళ్ళాలంటేనే భరించలేని దుర్వాసన వెదజల్లుతోంది. ఎన్నికలకు ముందు కాంట్రాక్ట్, అవుట్ సోర్సింగ్ కార్మికులకు ఇచ్చిన హామీలు ప్రభుత్వం నెరవేర్చటంలో చూపిన నిర్లక్ష్యంపై పట్టణ వాసులు, కార్మికులు తప్పు పడుతున్నారు. ఫలితంగా పట్టణంలో పారిశుధ్యం మెరుగుదల కార్యక్రమాలు నిలిచిపోవడంతో ఈ దుర్గంధం భరించలేకపోతున్నామని, ఇలా మరో రెండురోజులు ఉంటే అనారోగ్యంతో ఆసుపత్రిలో చేరటం ఖాయమని పట్టణవాసులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మున్సిపాలిటీలు ఎప్పటికప్పుడు పన్నులు వసూలు చేస్తుందని, ఆలస్యమైతే అపరాధ రుసుం విధించి మరీ తీసుకుంటుందని మరి పారిశుధ్యం మెరుగుకు అధికారులు ఎందుకు చర్యలు తీసుకోవడం లేదని పట్టణవాసులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. పట్టణాన్ని సుందీకరించాల్సింది పోయి ఇలా చెత్త పురపాలకంగా తయారు చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఉన్నతాధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి చెత్తను తొలగించేలా చర్యలు చేపట్టాలని కోరుతున్నారు.



మాట నిలబెట్టుకోవాలి

మున్సిపల్ కాంట్రాక్ట్, అవుట్ సోర్సింగ్ కార్మికులను అన్నివిధాలా ఆదుకుంటామని గత ఎన్నికల్లో ఇచ్చిన హామీని జగన్ నిలబెట్టుకోవాలి. సుప్రీంకోర్టు ఆర్డర్ అమలు చేస్తూ కనీస వేతనం రూ.26 వేలు ఇవ్వాలి.

-జి.రాజు, సీఐటీయూ కార్యదర్శి, నూజివీడు



పర్మినెంట్ చేయాలి

మేం రోగాల బారిన పడినా ప్రజలు బావుండాలని కోరుకుంటూ పనిచేస్తున్నాం. రెగ్యులర్ కార్మికుల కంటే ఎక్కువ పనిచేస్తున్న కాంట్రాక్ట్ అవుట్ సోర్సింగ్ కార్మికుల కష్టాన్ని ప్రభుత్వం గుర్తించి వారిని పర్మినెంట్ చేయాలి.

-కె.జయలక్ష్మి, మున్సిపల్ యూనియన్ నాయకురాలు



ప్రాణాలు పణంగా పెట్టి పనిచేశాం

కరోనా సమయంలో కనీసం తోబుట్టువులు, కన్నవారు కూడా చేయని పనులను చేశాం. ప్రజలంతా బావుండాలని కోరుకున్న మాకు అన్యాయం చేస్తే ఊరుకోం. రెగ్యులర్ చేయాల్సిందే.

-డి.రవి, మున్సిపల్ యూనియన్ నాయకుడు



కుదరదని చెప్పడం దారుణం

ముఖ్యమంత్రి ఇచ్చిన వాగ్దానం మేరకు పర్మినెంట్ అంశం అమలు చేయమంటే కుదరదని చెప్పడం దారుణం. మరి ఎన్నికల సమయంలో ఎందుకు హామీ ఇచ్చారు. మున్సిపల్ కార్మికుల డిమాండ్లు వెంటనే పరిష్కరించాలి.

- చాట్ల పుల్లారావు, ఏఐటీయూసీ ప్రధాన కార్యదర్శి, ఏలూరు జిల్లా.



కైకలూరులో కళ్లకు నల్లరిబ్బన్లు కట్టుకుని మోకాళ్లపై నిలబడి..



ఆగిరిపల్లి ఎమ్మార్వో కార్యాలయం వద్ద మోకాళ్లపై నిలబడి నిరసన

జగన్‌కు కనువిప్పు కలగదా..?

- దీక్షల్లో అంగన్వాడీల ఆగ్రహం
- వినూత్న రీతిలో నిరసనలు

కైకలూరు, జనవరి 5: రోజుకో విధంగా నిరసన తెలుపుతున్నా జగన్ ప్రభుత్వానికి కనువిప్పు కలగడం లేదని, రానున్న ఎన్నికల్లో జగన్‌కు బుద్ధి చెబుతామని అంగన్వాడీ యూనియన్ నాయకులు హెచ్చరించారు. శుక్రవారం కైకలూరు తహసీల్దార్ కార్యాలయం వద్ద కళ్లకు నల్లరిబ్బన్లు కట్టుకుని, మోకాళ్ళపై నిలబడి అంగన్వాడీ కార్యకర్తలు నిరసన తెలిపారు. దొంగ జీవోల పేరుతో తమను బెదిరించాలని చూస్తే ఆ నష్టం ప్రభుత్వానిదేనన్నారు. అంగన్వాడీ యూనియన్ నాయకులు పి. సుజాత, ఎల్. మీనాకుమారి, విజిత, ఝాన్సీ, ఉష, రమణ, తదితరులు పాల్గొన్నారు.

నూజివీడు: నూజివీడు సబ్ కలెక్టర్ కార్యాలయం వద్ద అంగన్‌వాడీల దీక్షలు శుక్రవారం నాటికి 25వ రోజుకు చేరాయి. ఈ సందర్భంగా అంగన్‌వాడీ యూనియన్ అధ్యక్షురాలు ఆదిలక్ష్మి మాట్లాడుతూ ఎన్నికలకు ముందు సీఎం జగన్ అంగన్‌వాడీలకు ఇచ్చిన హామీలను అమలు చేయాలని డిమాండ్ చేశారు. సీఐటీయూ అధ్యక్ష, కార్యదర్శులు ఎస్ఆర్ హనుమాన్లు, జి. రాజు, మణి, వసుంధర తదితరులు పాల్గొన్నారు.

ఆగిరిపల్లి: ఎమ్మార్వో కార్యాలయానికి వెళ్ళే దారికిరువైపులా అంగన్‌వాడీలు మోకాళ్ళపై నిలబడి అంగన్వాడీలు నిరసన తెలిపారు. తమ న్యాయమైన కోర్కెలను అంగీకరించే వరకు సమ్మె తప్పదని హెచ్చరించారు.

బెదిరింపులకు భయపడం..

ముసునూరు: బెదిరించి ఆందోళనలను విరమింపజేయాలని చూస్తే సహించమని అంగన్వాడీ వర్కర్స్ యూనియన్ నియోజకవర్గ కార్యదర్శి పి.రాజకుమారి హెచ్చరించారు. ముసునూరులో 25వ రోజు దీక్షలో అంగన్‌వాడీలు ఒంటి కాలుపై నిలబడి నిరసన తెలిపారు.

కలిదిండి: తమ డిమాండ్లను పరిష్కరించే వరకు సమ్మె కొనసాగిస్తామని అంగన్‌వాడీ నేతలు అబీదా బేగం, ఎం. లక్ష్మి అన్నారు. శుక్రవారం కలిదిండిలో అంగన్‌వాడీలు ధర్నా నిర్వహించారు. ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను అమలు చేయాలని డిమాండ్ చేశారు. అంగన్‌వాడీ నేతలు రమాదేవి, విజయకుమారి, లావణ్య జ్యోతి, భారతి, కృష్ణవేణి, సునీత పాల్గొన్నారు.

కలెక్టర్ ఉత్తర్వుల దహనం

ముదినేపల్లి: ముదినేపల్లి నిరసన దీక్షా శిబిరం వద్ద అంగన్‌వాడీలు తమను వెంటనే విధుల్లో చేరాలన్న కలెక్టర్ ఉత్తర్వులను నిరసిస్తూ నినాదాలు చేశారు. యూనియన్ నాయకులు సూరపనేని అరుణకుమారి, సొంగా మణి, బండి పద్మ నాయకత్వంలో అంగన్‌వాడీ ఉద్యోగులు కలెక్టర్ ఉత్తర్వుల కాపీలను దహనం చేసి, తమ డిమాండ్లు నెరవేర్చే వరకు తాము సమ్మె విరమించేది లేదని స్పష్టం చేశారు.



అమ్మవారిగూడెంలో భవిష్యత్‌కు గ్యారెంటీ



చిన్నంపేటలో బాండ్ అందజేస్తున్న మోరంపూడి

వాడుకున్న ఆర్థిక సంఘం నిధుల జమ ఎప్పుడు?

ఆగిరిపల్లి, జనవరి 5: ప్రతిపక్ష నాయకులు మంచి, చెడులు తెలుసుకుని మాట్లాడాలని లేకపోతే తగిన గుణపాఠం చెబుతామని టీడీపీ నూజివీడు నియోజకవర్గ ఇన్‌చార్జి, మాజీ ఎమ్మెల్యే ముద్దరబోయిన వెంకటేశ్వరరావు అన్నారు. ఆగిరిపల్లి మండలం అమ్మవారిగూడెంలో బాబు ష్యూరిటీ భవిష్యత్తుకు గ్యారెంటీ కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ ల్యాండ్ టైట్లింగ్ యాక్ట్ యజమానుల ఆస్తి హక్కులను కాలరాసేలా ఉందన్నారు. కేంద్రం ఇచ్చిన ఆర్థిక సంఘం నిధులను దారి మళ్ళించి గ్రామాల అభివృద్ధిని నీరుగార్చారని, వీటిని ఎప్పుడు జమ చేస్తారో అధికార పార్టీ నాయకులు గ్రామ ప్రథమ పౌరులకు సమాధానం చెప్పాలన్నారు. ఈ సందర్భంగా టీడీపీ అధికారంలోకి వస్తే చేపట్టే పథకాలపై ప్రజలకు వివరించారు.

ఉపాధి కల్పనలో వైసీపీ విఫలం..

కలిదిండి: ఉన్నత చదువులు అభ్యసించిన యువతకు ఉపాధి కల్పించడంలో వైసీపీ ప్రభుత్వం విఫలమైందని నియోజకవర్గ తెలుగు యువత ప్రధాన కార్యదర్శి నున్న సుబ్రహ్మణ్యం అన్నారు. శుక్రవారం కోరుకొల్లులో టీడీపీ, జనసేన నాయకులతో కలసి బాబు ష్యూరిటీ - భవిష్యత్‌కు గ్యారెంటీ కార్యక్రమం నిర్వహించారు. ఇంటింటికి వెళ్లి కరపత్రాలను పంపిణీ చేసి మేనిఫెస్టోలో పథకాలను వివరించారు. 20 లక్షల మంది యువతకు ఉపాధి కల్పించటమే చంద్రబాబు లక్ష్యమన్నారు. టీడీపీ, జనసేన నాయకులు పాల్గొన్నారు.

బాబు ష్యూరిటీ బాండ్ల అందజేత

చాట్రాయి: చిన్నంపేటలో బాబు ష్యూరిటీ భవిష్యత్తుకు గ్యారెంటీ నమోదును టీడీపీ నాయకులు చేపట్టారు. క్లస్టర్ ఇన్‌చార్జి, తెలుగు రైతు జిల్లా ప్రధాన కార్యదర్శి మోరంపూడి శ్రీనివాసరావు ఆధ్వర్యంలో నాయకులు ఇంటింటికి వెళ్ళి యాప్‌లో వివరాలు నమోదు చేసుకుని చంద్రబాబు, పవన్‌కల్యాణ్ సంతకాలతో ఉన్న బాండ్‌ను అందజేశారు. ఈ సందర్భంగా మోరంపూడి మాట్లాడుతూ వైసీపీ అరాచక పాలనకు విసిగిన ప్రజలు టీడీపీకి పట్టం కట్టేందుకు సిద్ధమయ్యారని అన్నారు.



పెద్దింట్లమ్మకు జడ్పీ చైర్‌పర్సన్ పూజలు

కైకలూరు, జనవరి 5: కొల్లేటికోట పెద్దింటమ్మ వారిని జడ్పీచైర్‌పర్సన్ గంటా పద్మశ్రీ దంపతులు దర్శించుకున్నారు. ఆలయ అధికారి కేవీ గోపాలరావు వారికి స్వాగతం పలికారు. అర్చకులు వారితో విశేష పూజలను చేయించారు. వారిని సత్కరించి అమ్మవారి ప్రతిమను అందజేశారు. ఏలూరు మండల జడ్పీటీసీ సభ్యురాలు సరస్వతి తదితరులు పాల్గొన్నారు.

కెరీర్ గైడెన్స్‌పై అవగాహన



మండవల్లి, జనవరి 5: మండవల్లి మండలం చింతపాడు జడ్పీ హైస్కూల్‌లో పదో తరగతి విద్యార్థులకు కెరీర్ గైడెన్స్‌పై ప్రొఫెసర్ సుధాబత్తుల విజయ్‌కుమార్ అవగాహన కల్పించారు. కైకలూరు మానవత సేవా సంస్థ అధ్యక్షుడు కొండ్రెడ్డి సత్యనారాయణ ఆధ్వర్యంలో చింతపాడు ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో శుక్రవారం ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. మానవత సభ్యులతో పాటు పాఠశాల ప్రిన్సిపాల్ రామాంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

నిధుల దుర్వినియోగం ఫిర్యాదుపై విచారణ ముమ్మరం

ముదినేపల్లి, జనవరి 5 : పెయ్యేరు పంచాయతీలో నిధుల దుర్వినియోగం, పాలనా అంశాల్లో అవకతవకలు చోటు చేసుకున్నాయన్న అభియోగాలపై విచారణ ముమ్మరంగా సాగుతోంది. నీటి కుళాయిల మంజూరులో నిబంధనలు పాటించలేదని దాఖలైన పిటిషన్ మేరకు హైకోర్టు విచారణకు ఆదేశించిన నేపథ్యంలో మూడు రోజులుగా పంచాయతీ అధికారులు విచారణ నిర్వహిస్తున్నారు. శుక్రవారం ఏలూరు, పెదపాడు, భీమడోలు మండలాలకు చెందిన పలు పంచాయతీల సిబ్బంది ముగ్గురు ఈవోపీఆర్డీల ఆధ్వర్యంలో కుళాయిల మంజూరుపై పంచాయతీ ఏరియాలో విచారణ నిర్వహించారు. పంచాయతీ పరిధిలో 350 కులాయి కనెక్షన్లు ఉండగా 74 కనెక్షన్లకు చెల్లించిన సొమ్ముకు రశీదులు ఉన్నట్టు అధికారులు గుర్తించారు. గతంలో ఇచ్చిన కనెక్షన్లకు ఎటువంటి ఆధారాలు లేవు. అంతేకాక చాలా నీటి కుళాయిల లబ్ధిదారుల నుంచి కుళాయిల ఫీజు కూడా వసూలు చేయటం లేదని గుర్తించారు. అభియోగాలపై డీఎల్‌పీవో చంద్రశేఖర్ రికార్డులను పరిశీలిస్తున్నారు.

అర్హులందరికీ పింఛన్

చాట్రాయి, జనవరి 5: అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందించి పేదరిక నిర్మూలకు ప్రభుత్వం కృషి చేస్తున్నదని నూజివీడు ఎమ్మెల్యే మేకా ప్రతాప్ అన్నారు. చాట్రాయిలో శుక్రవారం రూ. మూడు వేలకు పెంచిన పింఛన్లను ఎమ్మెల్యే పంపిణీ చేశారు. రాష్ట్ర సహకార యూనియన్ చైర్మన్ దేశిరెడ్డి రాఘవరెడ్డి, ఎంపీపీ నిర్మల, వైస్ ఎంపీపీలు సుబ్బారెడ్డి, జగన్మోహనరావు, ఎంపీడీవో దుర్గాప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

సురక్షలో వైద్య సేవలు

ఆగిరిపల్లి, జనవరి 5: నెక్కలం గొల్లగూడెంలో రెండో విడత సురక్ష కార్యక్రమంలో 519 మంది వైద్య సేవలు పొందారు. ప్రత్యేక వైద్యులతో పాటు గైనిక్, జనరల్ వైద్యులు పాల్గొన్నారు. 70 మంది పిల్లలకు, గర్భిణులు, బాలింతలకు వైద్య పరీక్షలు చేశారు. ఉదయం 8.30 నుంచి సాయంత్రం 5.30 వరకు వైద్య సేవలందించినట్టు పీహెచ్‌సీ డాక్టర్ జగన్మోహన్‌రావు తెలిపారు.



విశ్రాంత ఉద్యోగుల సంఘం క్యాలెండర్ ఆవిష్కరిస్తున్న డీఎస్పీ

క్యాలెండర్ ఆవిష్కరణ

నూజివీడు టౌన్, జనవరి 5: రాష్ట్ర విశ్రాంత ఉద్యోగుల సంక్షేమ సంఘం నూజివీడు శాఖ క్యాలెండర్‌ను నూజివీడు డీఎస్పీ ఈ.అశోక్‌కుమార్‌గౌడ్ ఆవిష్కరించారు. నూజివీడు డీఎస్పీ కార్యాలయంలో జరిగిన ఈ కార్యక్రమంలో సంఘ నాయకులు బండారు సత్యనారాయణ, దిలీప్, పిచ్చియ్య, కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఎన్ఆర్ఐలో జాతీయ సదస్సు



ఆగిరిపల్లి, జనవరి 5: విద్యార్థుల ప్రతిభా పాటవాలకు వేదికగా 'సన్‌రైజ్ 234' నిలిచిందని, 4 వేల మంది విద్యార్థులు 67 రకాల పోటీల్లో తమ నైపుణ్యం చాటారని కన్వీనర్ ఆర్.సునీత పేర్కొన్నారు. ఆగిరిపల్లి ఎన్ఆర్ఐ ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీలో శుక్రవారం 'సన్‌రైజ్ -234' పేరిట జాతీయ సదస్సును కళాశాల చైర్మన్ డాక్టర్ ఆర్.వెంకట్రావు ప్రారంభించి మాట్లాడుతూ విద్యార్థుల ఉజ్వల భవిష్యత్తుకు సోపానం వేయటం ఈ కార్యక్రమం ముఖ్య ఉద్దేశమన్నారు. కళాశాల ప్రిన్సిపాల్ నాగ భాస్కర్, అకడమిక్ డైరెక్టర్ డాక్టర్ జి.సాంబశివరావు తదితరులు ప్రసంగించారు.

పేదలకు రగ్గుల వితరణ



నూజివీడు టౌన్, జనవరి 5: పేదలకు జేకే ట్రస్ట్ సేవలు అభినందనీయమని టీడీపీ నూజివీడు మండల అధ్యక్షుడు ముసునూరి రాజా అన్నారు. బత్తులవారి గూడెంలో జేకే ట్రస్ట్ ఆధ్వర్యంలో పేద వృద్ధులు దాదాపు 200 మందికి ట్రస్ట్ చైర్మన్ డాక్టర్ సి. జయకిషన్ దుప్పట్లు, రగ్గులను పంపిణీ చేశారు. సర్పంచ్ లక్ష్మీకాంతమ్మ తదితరులు పాల్గొన్నారు.

సేంద్రియ విధానంపై అవగాహన



నూజివీడు టౌన్, జనవరి 5: వేప గింజల కషాయం వాడకంతో పంటలపై చీడపీడలను నివారించవచ్చని నూజివీడు హార్టికల్చర్ పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపాల్ విజయలక్ష్మి అన్నారు. మిట్టగూడెంలో సేంద్రియ విధానం, పెరటి తోటల పెంపకంపై రైతులకు నూజివీడు హార్టికల్చర్ పాలిటెక్నిక్ కళాశాల ఎన్ఎస్ఎస్ విభాగం ఆధ్వర్యంలో విద్యార్థులు అవగాహన కల్పించారు. పెరటి తోటల పెంపకం, రసాయన రహిత కూరగాయల పెంపకం, వేప గింజల కషాయం తయారీపై రైతులకు అవగాహన కల్పించారు. అధ్యాపక సిబ్బంది డాక్టర్ పద్మజ, డాక్టర్ భవాని, డాక్టర్ కంచన తదితరులు పాల్గొన్నారు.

బీసీ సంఘం వర్కింగ్ ప్రెసిడెంట్‌గా చింతగుంట్ల



చాట్రాయి, జనవరి 5: ఏలూరు జిల్లా బీసీ సంక్షేమ సంఘం వర్కింగ్ ప్రెసిడెంట్‌గా మండలంలోని కృష్ణారావుపాలెం గ్రామానికి చెందిన చింతగుంట్ల వెంకటేశ్వరరావు నియమితులయ్యారు. ఈ మేరకు జాతీయ, రాష్ట్ర అధ్యక్షులు ఆర్. కృష్ణయ్య, ఎన్. మారేష్ నియామక పత్రం అందజేశారు. తననీ పదవికి ఎంపిక చేసిన మంత్రి జోగి రమేష్, నాయకులకు చింతగుంట్ల కృతజ్ఞతలు తెలిపారు. బలహీన వర్గాల హక్కుల కోసం పోరాడతానని చింతగుంట్ల చెప్పారు.

పోతనపల్లి వాసికి పీహెచ్‌డీ



బి.రాజేంద్రప్రసాద్

చాట్రాయి, జనవరి 5: మండలంలోకి పోతనపల్లి లంబాడా తండాకు చెందిన బాణావతు రాజేంద్రప్రసాద్ ఏయూ వీసీ ప్రొఫెసర్ జేమ్స్ స్టీఫెన్ చేతుల మీదుగా పీహెచ్‌డీ పట్టా అందుకున్నారు. ఈయన ఎన్టీఆర్ జిల్లా మైలవరం లకిరెడ్డి బాలిరెడ్డి ఇంజనీరింగ్ కళాశాలలో అధ్యాపకుడిగా పనిచేస్తున్నారు. ప్రొఫెసర్ పీవీజీడీ ప్రసాదరెడ్డి, ప్రొఫెసర్ జేమ్స్ స్టీఫెన్, ఏయూ రిజిస్ట్రార్ పర్యవేక్షణలో పరిశోధనలు చేసినట్టు ఆయన తెలిపారు. రాజేంద్రప్రసాద్‌ను లంబాడి సంఘం నాయకులు పాంచాలి, మంగయ్య శంకరం, పేరయ్య, రాము, హాస్సేన్, చెన్నారావు తదితరులు అభినందించారు.

సేవా దృక్పథంతో పని చేయాలి

ముదినేపల్లి, జనవరి 5 : గ్రామాల్లో వలంటీర్లు సేవా దృక్పథంతో పని చేయాలని ముదినేపల్లి ఎంపీపీ రామిశెట్టి సత్యనారాయణ తెలిపారు. శుక్రవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో మండలంలోని పలు గ్రామాల్లో నూతనంగా నియమితులైన వలంటీర్లకు నియామక పత్రాలు అందజేశారు. ప్రభుత్వానికి, ప్రజలకు వారధులుగా వలంటీర్లు వ్యవహరించాలన్నారు. ఎంపీడీవో పి.మల్లీశ్వరి, మండల సర్పంచ్‌ల ఫోరం అధ్యక్షులు శీలం రామకృష్ణ, పెయ్యేరు ఉప సర్పంచ్ దివి సతీష్ తదితరులు పాల్గొన్నారు.